ప్రజాశక్తి

గురువారం 30 మే 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

❁ముమ్మరంగా పారిశుధ్య చర్యలు ❁నీటి నమూనాల సేకరణ ❁డిఎంహెచ్‌ఒ పరిశీలన ❁అతిసార విజృంభణ ❁చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం నిరసన





మృతులు కాకర్లమూడి ఇందిర, శిఖా ఇందిర



సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం వద్ద సేవలందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - విజయవాడ

మొగల్రాజపురంలో అతిసార ప్రబలడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ఆ ప్రాంతంలో అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పారిశుధ్యం మెరుగుదలకు ముమ్మరంగా చర్యలు తీసుకుంటున్నారు. ఆ ప్రాంతాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుహాసిని పరిశీలించి తగిన ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం, విఎంసి నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన ఆ ప్రాంతంలో ఆందోళన చేపట్టారు. బాధితులను ఆదుకోవాలని డిమాండ చేశారు. మొగల్రాజపురంలో అతిసార విజృంభణతో గత పదిరోజుల్లో నలుగురు మరణించారు. మరో 50 మందికిపైగా బాధితులు పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 100 మందికిపైగా అతిసార బారినపడ్డారు. బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కలుషిత నీరు తాగడం వల్లే అతిసార ప్రబలినట్లు భావిస్తున్నారు. గత పది రోజులుగా పలువురు వాంతులు, విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారు. ఈ నేపథ్యంలో తీవ్ర అస్వస్థతకు గురైన చంద్ర రాజేశ్వరరావు నగర్లో నివాసం ఉంటున్న శిఖా ఇందిర (36)ను ఆరురోజుల క్రితం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళుతుండగా, మార్గమధ్యంలో మరణించింది. అలాగే మూడు రోజుల క్రితం బందులదొడ్డి ప్రాంతంలో నివాసం ఉంటున్న కాకార్లమూడి ఇందిర (55), బోయపాటి మాధవరావు వీధిలో నివాసం ఉంటున్న వల్లూరి దుర్గారావు (46) తమ తమ ఇళ్ల వద్దే మరణించారు. బందులదొడ్డి ప్రాంతంలో నివాసం ఉంటున్న ఇడుపుల కళ్యాణ్ (26) మంగళవారం ఇళ్ల వద్దే మరణించాడు. అలాగే అస్వస్థతకు గురైన సాయి, కొడవటి శివ, వల్లూరు వెంకటేశ్వరరావు, మంగమ్మ (భార్యాభర్తలు), పటమట వరలక్ష్మీ, శాయి సుధాకర్ పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొంది డిశ్చార్జి అయ్యారు. ఇంకా సుమారు 50 మందికిపైగా వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ప్రత్యేక వైద్య శిబిరాల ఏర్పాటు

విజయవాడ ఏడో డివిజన్ మొగల్రాజపురంలోని సిపిఎం కార్యాలయంలో అధికారులు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అలాగే విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో 30 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి అతిసార బాధితులకు ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్య (మిగతా 2లో)

ప్రభుత్వం, విఎంసి బాధ్యత వహించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్



వైద్య శిబిరంలో బాధితులను పరామర్శిస్తున్న సిపిఎం రాష్ట్ర నేత సిహెచ్.బాబూరావు, సిటీ నేత పి.కృష్ణ

అతిసారతో నలుగురు మృతికి రాష్ట్ర ప్రభుత్వం, విజయవాడ నగరపాలక సంస్థ బాధ్యత వహించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. మృతి చెందిన వారి ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని కోరారు. మొగల్రాజపురం ప్రాంతంలో అతిసార బారినపడిన పలువురు బాధితులను సిపిఎం నేతలు పరామర్శించారు. ఇంటింటికీ తిరిగి వివరాలను సేకరించారు. డిఎంహెచ్‌ఒ డాక్టర్ సుహాసిని తదితర అధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. అతిసార నివారణకు తీసుకుంటున్న చర్యలు, రోగులకు కల్పిస్తున్న వైద్యసేవలు, వ్యాధి విజృంభించడానికి దారితీసిన పరిస్థితులు, నీటి నమూనా నివేదికలు తదితర అంశాలపై డిఎంఒహెచ్‌ను నిలదీశారు. విఎంసి, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ అక్కడ ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా (మిగతా 2లో)

40 అతిసార కేసులు నమోదు

జిల్లా వైద్యఆరోగ్య అధికారి డాక్టర్ సుహాసిని



మొగల్రాజపురం ప్రాంతంలో 40 అతిసార కేసులు నమోదయ్యాయని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు. అయితే ఇవి దేని వల్ల సంభవించాయే తెలియాల్సి ఉందని చెప్పారు. మొగల్రాజపురంలో ఏర్పాటు చేసిన వైద్య శిభిరం వద్ద బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. మొగల్రాజపురంలోని దుర్గారావు అనే వ్యక్తి మృతి చెందాడని, అయితే ఆయన ఎందుకు చనిపోయాడన్న విషయమై స్పష్టత రావాల్సి ఉందని అన్నారు. దుర్గారావుకు నాలుగు సార్లు విరోచనాలైనట్లు కుటుంబ సభ్యులు చెప్పారని, అయితే ఆయనకు పిట్స్ కూడా ఉన్నాయని చెప్పారని తెలిపారు. ఈ నేపథ్యంలో దుర్గారావు మరణంపై ఆర్ఆర్ నివేదిక రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య స్పెషల్ సెక్రటరీ, సెక్రటరీ, జిల్లా కలెక్టర్, నగర కమిషనర్ ఆదేశాల మేరకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దుర్గారావు ఎందువల్ల మరణించాడన్న దానిపై విచారణ జరుపుతున్నామని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గారావు విరోచనాల బారిన పడి కోలుకున్నాడని, కానీ అతనికి దీర్ఘకాలంగా మూర్చ వ్యాధి ఉందని తెలిపారు. జిల్లా వైద్యాధికారులిచ్చిన నివేదిక ఆధారంగా అతని మృతిపై వివరాలను వెల్లడిస్తామని తెలిపారు. నీటి నమూనాల ప్రాథమిక పరీక్షల్లో కలుషిత లక్షణాలు కనిపించలేదని తెలిపారు. 802 కుటుంబాలను సమగ్ర ఆరోగ్య సర్వే కూడా నిర్వహించామన్నారు.

ఉపాధి పనులే దిక్కు!

❁మే నెలాఖరుకు పనిదినాల లక్ష్యం 38.75 లక్షలు ❁ఇప్పటికే 41.06 లక్షల పని దినాలు పూర్తి ❁కార్మికులకు క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ❁రోజు కూలిలో కోత

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వ్యవసాయ పనులు తగ్గిపోవడం, ప్రత్యామ్నాయ ఉపాధి లేకపోవడం కారణంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనులకు డిమాండ్ విపరీతంగా పెరిగిపోతోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో మే వరకు నిర్ణయించిన లక్ష్యానికి మించి కార్మికులు ఉపాధి పనులకు వచ్చారు. జిల్లాలో 2 లక్షల 10 వేల 793 జాబ్ కార్డులున్నాయి. వీటిలో లక్షా 73 వేల 616 కార్డులు యాక్టివ్లో ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మే వరకు 38.75 లక్షల పనిదినాలను లక్ష్యంగా



నిర్ణయించారు. ఏప్రిల్‌తోపాటు మే 28వ తేదీ నాటికి 41 లక్షల 6 వేల మంది వ్యవసాయ కార్మికులు ఉపాధి పనులకు వెళ్లారు. ఇది నిర్ణయించిన లక్ష్యానికి మించిపోయింది. మే 20వ తేదీ వరకు రూ.107 కోట్ల వరకు కార్మికుల ఖాతాల్లో జమయ్యాయి. మరో పక్క ఉపాధి పనులకు వెళ్లే కార్మికులకు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు వెన్నాడుతున్నాయి. కార్మికులకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదు. రోజువారీ చేసిన పనికి చట్ట ప్రకారం పూర్తి స్థాయిలో కూలి రావడం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఉపాధి కూలిలో కోతలు !

ప్రభుత్వాలు ఉపాధి కార్మికులకు క్షేత్రస్తాయిలో సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయి. వేసవి ఎండల్లోనూ కార్మికులకు టెంట్లు వేయడం లేదు. మజ్జిగ, మంచినీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. వీటిని కార్మికులు తమ సొంత ఖర్చులతోనే సమకూర్చు కోవాల్సి వస్తోంది. గతంలో ఉపాధి పనులకు ఉపయోగించే పొలుగు, పారలు సరిపించుకోవడానికి ప్రత్యేకంగా ప్రభుత్వం నగదు ఇచ్చేది. వీటితోపాటు మార్చి నుంచి మే నెలాఖరు వరకు ఇచ్చే ప్రత్యేక వేసవి అదనపు ఎలవెన్స్‌ను కేంద్రం నిలిపివేసింది. ఈ సీజన్లో ఉపాధి కార్మికులకు రోజు కూలిని రూ.272 నుంచి రూ.300కు పెంచినట్లు కేంద్రం ప్రకటించింది. క్షేత్రస్థాయిలో పరిశీలించినప్పుడు కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం తేలప్రోలు, ఆత్కూరు, (మిగతా 2లో)

దారిదోపిడీ కేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెడుతున్న సిఐ ప్రసాద్ తదితరులు



దారిదోపిడీ కేసులో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - భవానీపురం : ఇటీవల సూరాయిపాలెం గ్రామంలో చోటుచేసుకున్న కారు దోపిడీ ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు భవానీపురం సిఐ ప్రసాద్ తెలిపారు. ఈనెల 26న నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సిఐ కథనం ప్రకారం....ఈనెల 25న విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించుకునే నిమిత్తం నల్గొండ నుండి కొందరు కారులో విజయవాడ వస్తున్నారు. ఈక్రమంలో సురాయిపాలెం గ్రామం సమీపంలో కారు ఆపారు. ఈలోగా వెనుకనుండి మరోకారులో వచ్చిన కొందరు దానికి ముందు అడ్డుగా పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు కిందకుదిగి పోలీసులమని చెబుతూ కార్ డ్రైవర్‌ను కొట్టారు. వెంటనే డ్రైవర్ కారును స్టార్ట్ చేసి కొద్ది దూరం గ్రామంలోకి వెళుతున్న సమయంలో కారు, ఆటో, బైక్‌లపై వచ్చిన కొందరు వ్యక్తులు ఫిర్యాది కార్‌ను వెంబడించారు. కారును ఆపి కర్రలు, మారణాయుధాలతో (మిగతా 2లో)

వాంబేకాలనీలో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : నగరంలో కలుషిత తాగునీరు వలన అతిసార వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్తగా వాంబే కాలనీ ఆరోగ్య కేంద్రాల్లోని సిబ్బందిని అప్రమత్తం చేశారు.

మొదటిపేజీ తరువాయి

ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు

శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని పర్యవేక్షణలో మొగల్రాజపురంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచే చర్యలు చేపట్టారు. అక్కడే మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేసి మంచినీటి నమూనాలను పరీక్షిస్తున్నారు. ఏడుగురు వైద్యులతోపాటు 30 మంది మెడికల్ సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు. అత్యవసర సేవల కింద108 వాహనాన్ని అందుబాటులో ఉంచారు. డ్రైన్లు, వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. శిథిలావస్థకు చేరి, పొంగిపొర్లుతున్న మ్యాన్‌హోల్స్‌ను, పైప్‌లైన్లను తొలగించి మరమ్మతులు చేస్తున్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ అతిసార రోగులను గుర్తిస్తున్నారు. నీటి నమూనాలను సేకరిస్తున్నారు. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. పైప్‌లైన్ల ద్వారా వస్తున్న నీటిని కొన్నిరోజుల పాటు తాగొద్దని ఆరోగ్య సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

పకీరుగూడెం నుండి బోరు నీరు సరఫరా

విజయవాడ తూర్పు నియోజకవర్గ పరిధిలోని పకీరుగూడెం ప్రాంతం నుండి మొగల్రాజుపురం ప్రాంతంలోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు మంచినీరు సరఫరా అవుతోంది. మూడు దశాబ్దాల క్రితం వేసిన పైప్‌లైన్లు లీకై మురుగునీరు కలవడంతో మంచినీరు కలుషితం కావడం, ఈ నీటిని ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయకుండా నేరుగా సరఫరా చేయడం వల్ల ప్రజలు అస్వస్థతకు గురైనట్లు భావిస్తున్నారు. అయితే నగరపాలక సంస్థ, ప్రభుత్వం నేటికీ ప్రజలు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను తేల్చలేదు. ప్రాథమిక స్థాయిలో కూడా సమాచారాన్ని వెల్లడించలేదు. దీనిపై అత్యంత గోప్యతపాటిస్తూ హడావుడి చేస్తున్నారు. నీటి నమూనాల్లో మంచినీరు కలుషితమైనట్లు తేలలేదని చెబుతున్నారు. దుర్గారావు అనే వ్యక్తి వాంతులు, వీరోచనాలతో బాధపడినా, పిట్స్ కారణంగా మరణించాడని విఎంసి అధికారులు చెబుతున్నారు. మొత్తంగా అతిసార మృతి కేసులు లేవని ప్రచారం చేస్తున్నారు.

ముగ్గురు విఎంసి సిబ్బందికి షోకాజ్ నోటీసులు

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు విఎంసి సిబ్బందికి నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎఇ నాగేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎమినిటీ సెక్రటరీ పవన్‌లకు నోటీసులిచ్చారు. నీటి నమూనాలను పరీక్షల కోసం గుంటూరు ల్యాబ్స్‌కు పంపామని, వివరాలు వచ్చిన అనంతరం వెల్లడిస్తామని కమిషనర్ తెలిపారు.

ప్రభుత్వం, విఎంసి బాధ్యత వహించాలి

బాబూరావు మాట్లాడుతూ బాధితుల వైద్య ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున సాయం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్... వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, కారణాలను గుర్తించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పరిస్థితికి గల కారణాలను వెల్లడించాలని కోరారు. మొగల్రాజపురం ప్రాంతానికి కృష్ణానది నుంచి రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. శిథిలావస్థకు చేరిన మంచినీటి పైప్ లైన్ల మార్పిడికి నిధులు కేటాయించాలని, నగర వ్యాప్తంగా అధ్వానంగా ఉన్న రిజర్వాయర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయటానికి సిబ్బందిని కేటాయించాలని కోరారు. నీటి సరఫరా సిబ్బందిని పెంచాలని పేర్కొన్నారు. నీటి కాలుష్యం, సరఫరాపై వస్తున్న ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. బందరు కాల్వ ఎండిపోవడంతో మురుగు నీటితో నిండిపోయిందని, దీని పక్కనే ఉన్న బోరు భూగర్భ జలాలు కలుషితం అయ్యాయని, వీటివల్లే నీటి కాలుష్యం ఏర్పడినట్లు భావిస్తున్నారని తెలిపారు. ఒకపక్క మంచినీరు కలుషితం కాలేదని చెబుతూ, మరోపక్క ఒకరు మాత్రమే అతిసారకు గురయ్యారని ఉన్నతాధికారులు ప్రకటించడం హాస్యాస్పదమని మండిపడ్డారు. ప్రజాప్రతినిధులు ఈ ఘటనపై స్పందించకపోవడం, కనీసం పరామర్శించకపోవడం సిగ్గుచేటన్నారు. ఈకార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు సిటీ నాయకులు పి.కృష్ణ, జి.క్రాంతి, మురహరి, టి.చంద్రశేఖర్, కె.రమణ, స్థానిక నేతలు స్టాలిన్, ధర్మారావు, కిరణ్, డి.శివ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులే దిక్కు

నందమూరు గ్రామాల్లో తమకు పూర్తి స్థాయిలో వేతనం జమవ్వడం లేదని ఉపాధి కార్మికులు వాపోతున్నారు. ఇద్దరు కూలీలు రెండు మీటర్ల వెడల్పు, మూడు మీటర్ల పొడవు, అడుగు లోతు తవ్వాలి. రోజు కూలి కింద ఆరు మీటర్లు తవ్వాలి. ఎనిమిది మీటర్ల నుంచి 12 మీటర్ల వరకు పని చేయించి అదనపు భారం మోపుతున్నారని కార్మికులు చెబుతున్నారు. రోజువారీ పే స్లిప్పులు ఇవ్వకపోవడంతో బ్యాంకు పుస్తకాన్ని పరిశీలించినప్పుడు మాత్రమే కూలి ఎంత జమయిందో తెలుస్తోంది. పని భారం పెంచినా రోజు కూలి రూ.250 నుంచి 280 వరకు మాత్రమే బ్యాంకు ఖాతాల్లో జమవుతోందని చెబుతున్నారు. ఒక్కొక్కరికి అత్యల్పంగా రూ.20 నుంచి అత్యధికంగా రూ.50 వరకు కూలిలో కోత పడుతోంది.

కుటుంబానికి సగటున 30 రోజులే పనులు

గిట్టుబాటవ్వడం లేదనే కారణంతో 1.20 లక్షల ఎకరాల వ్యవసాయ భూములను ఆక్వా చెరువులుగా మార్చేశారు. ఎక్కువ మందికి ఉపాధి చూపే చెరకు సాగు క్షీణించిపోయింది. వరి, మినుము పంటల కోత, నూర్పిడి యంత్రాలు (హార్వెస్టర్లు) పెరిగిపోయాయి. పారిశ్రామిక రంగంలో జిల్లా వెనుకబాటు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టమే దిక్కవుతోంది. వ్యవసాయ పనులతో పోల్చుకున్నప్పుడు ఉపాధి పనులకు ప్రభుత్వం నిర్ణయించిన కూలి చాలా తక్కువ. వ్యవసాయ సీజన్లో సగటున రోజుకు రూ.500 వరకు కార్మికులకు కూలి గిట్టుబాటవుతుంది. మరోవైపు కార్మికులకు పనిదినాలు తగ్గిపోతున్నాయి. ఏడాదికి గతంలో 130 రోజుల వరకు వ్యవసాయంలో కార్మికులకు పనిదినాలు లభించగా, ప్రస్తుతం 60 రోజులకు మించి పనులు దొరకడం లేదు. ఈ పరిస్థితుల్లోనే పొట్టనింపుకోవడానికి కార్మికులు ఉపాధి పనులను ఆశ్రయిస్తున్నారు. ఉపాధి చట్టం ప్రకారం గ్రామీణ పేదలకు 100 రోజులపాటు పని దినాలు కల్పించాలి. ఇన్ని పనిదినాలు పొందిన కార్మికుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. లక్ష్యం దాటినట్లు జిల్లా అధికారులు చెబుతున్నా సగటున 30 రోజులు మాత్రమే ఒక్కో కుటుంబానికి పనులు లభించాయి.

కుటుంబానికి 200 రోజులపాటు ఉపాధి చూపాలి

పి.పవన్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు తగ్గిపోయాయి.ఉపాధి చట్టం ప్రకారం వ్యవసాయ కార్మికులకు 100 రోజులు పనులు చూపాలి. ఏడాదిలో 30 నుంచి 40 రోజులు మాత్రమే పనులు చూపుతున్నారు. జాబ్‌కార్డును కుటుంబానికి ప్రామాణికంగా తీసుకుంటున్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలి. మరోపక్క కార్మికులు పనికి చెల్లించే కూలిలోనూ కోత పెడుతున్నారు. కూలి చెల్లింపుల్లో కోత పడకుండా కార్మికులకు రోజు వారీ పే స్లిప్‌లు ఇవ్వాలి.

దారిదోపిడీ కేసులో నిందితుల అరెస్టు

దాడి చేసి ఫిర్యాది హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రూ.20 వేల నగదును తీసుకుని పరారయ్యారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్. నెం.337/2024 అండర్ సెక్షన్ 170, 419, 397 ఐపిసి కింద కేసు నమోదు చేశారు. సిపి పి.హెచ్.డి.రామకష్ణ ఆదేశాల మేరకు పశ్చిమ జోన్ డిసిపి టి.హరికష్ణ, ఎసిపి మురళీకష్ణా రెడ్డి పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేసి సంఘటనా స్థలానికి చెరుకుని ఆధారాలను సేకరించి అనుమానితులపై నిఘా ఏర్పాటు చేశారు. ఈనేపథ్యంలో ఇన్స్పెక్టర్‌కు వచ్చిన పక్కా సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి సివిఆర్ ఫ్లైవోవర్ కింద రామరాజ్య నగర్ కట్ట వెళ్లే మార్గ సమీపంలోకి వెళ్లారు. పోలీసుల రాకను గమనించి పారిపోవడానికి ప్రయతించిన ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని విచారించి అరెస్ట్ చేశారు. జల్సాలకు అలవాటుపడిన వీరు ఏవిధంగానైనా సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో హైవేలపై దారి దోపిడీలు చేయాలని నిర్ణయించుకున్నారు. గుంటూరు జిల్లాలోని తమ మిత్రులకు కూడా కలుపుకుని పోలీసులమని చెప్పి హైవేలపై ప్రయాణీకులను బెదిరించి వారి వద్ద నుండి డబ్బులు లాక్కోవాలని పథకం పన్నారు. లాఠీలను, ఇనుప రాడ్లను, టిడిలను సమకూర్చుకొని ఈనెల 25న ఎంఆర్ సెల్ఫ్ డ్రైవింగ్ ట్రావెల్స్‌లో కారును అద్దెకు తీసుకుని నలుగురు కారులో, ఇద్దరు ఆటోలో, మరో ఇద్దరు బైక్‌పై ఇబ్రహీంపట్నం వైపు వెళ్లారు. బైక్‌పై ఉన్న శ్రీనివాస్ ఇబ్రహింపట్నం వరకు వెళ్లి అక్కడ నుండి కారులను గమనించి తెలియజేస్తానని చెప్పి ముందుకు వెళ్లాడు. ఈ సమయంలో వారు ఉన్న ప్రదేశానికి కొద్ది దూరంలో సూరంపల్లి వద్ద ఒక కారు ఆగడం గమనించి వెంటనే కారు తీసుకుని వెళ్లి వారి కారుకు అడ్డంపెట్టి భయభ్రాంతులకు గురిచేశారు. వారిని కొట్టి వారి వద్ద ఉన్న డబ్బులు లాక్కొనే సమయంలో వారి అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చారు. దీంతో అద్దెకు తీసుకువచ్చిన కారును వదిలేసి ఆటోలో, బైక్‌పై పరారయ్యారు. ఆ కార్డు డిక్కీలో ఈవెంట్లకు ఉపయోగించే బొమ్మ నగదు నోట్లు, లాఠీలు, ఆ ప్రదేశంలో ఉన్న రాడ్లను, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈనెల 28న దోపిడీ చేసేందుకు ఉపయోగించిన అద్దె కారును ఏవిధంగా తీసుకురావాలనే విషయం మాట్లాడటానికి సివిఆర్ ఫ్లైవోవర్ కింద రామరాజ్య నగర్ కట్ట సమీపంలోకి వచ్చిన సమయంలో పోలీసులు వారిని అరెస్టు చేశారు.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా

విజయవాడ తపాలా శాఖాధికారి నరసింహ స్వామి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : తక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా సదుపాయాన్ని తపాలా శాఖ... టాటా గ్రూప్ సౌజన్యంతో ప్రజలకు అందుబాటులో తీసుకొచ్చిందని విజయవాడ తపాలా శాఖ అధికారి, సీనియర్ సూపరింటెంట్ నరసింహ స్వామి తెలిపారు. రూ.520లతో ప్రమాద బీమా చేసుకుని ప్రమాద వశాత్తూ మరణించిన స్థానిక గురజాడ గ్రామ నివాస కుటుంబానికి తపాలా శాఖ అధికారులు రూ.10 లక్షల చెక్కును అందచేశారు. రూ.755లతో ప్రమాద బీమా చేసుకుంటే రూ.15 లక్షల బీమా, లక్ష రూపాయల ఆస్పత్రి ఖర్చులు, ఏడాదికొకసారి ఉచిత హెల్త్ చెకప్, ఉచిత డాక్టర్ టెలి కన్సల్టేషన్ వంటి సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. ఈ ప్రమాద పాలసీ ప్రతి పోస్టాఫీసులో అందుబాటులో ఉందని, ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐపిపిబి బ్యాంకు అధికారులు ఎస్.సుబ్బారావు, కె. అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.



అనధికార హోర్డింగ్‌లను తీసేయండి

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం విఎంసి ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే 224 ఖాళీ హోర్డింగ్ ఫ్రేమ్లను తీసేశారని తెలిపారు. గత సమావేశంలో ప్లానింగ్ సెక్రటరీలకు అనధికార హోర్డింగ్లను తీసేయాలని, గడువు ముగిసిన హోల్డింగ్లను తీసేయాలన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, ఉయ్యూరు
ఓ.ఎస్.నెం.2/2021

బిట్వీన్:
ఆనం రమాదేవి మరియు ముగ్గురు ఇతరులు ... వాదులు

మరియు

పండలనేని నాంచారయ్య మరియు ఆరుగురు ఇతరులు ... ప్రతివాదులు

7వ ప్రతివాది:
విజ్జపు లక్ష్మిపార్వతి, భర్త. హరిప్రసాద్, డోర్ నెం.73-4-39/1, ప్లాట్ నెం.55, తోటవారి వీధి, పటమట, విజయవాడ.

ఈ దావాను వాదులు, ప్రతివాదులపై పార్టీషన్ దావా దాఖలు చేయటమైనది. 7వ ప్రతివాది యొక్క హాజరు నిమిత్తం ది.19-06-2024 వాయిదా అయివున్నది. ఆ రోజున 7వ ప్రతివాది పై కోర్టు వారి ఎదుట ఉదయం గం.10.30ని.లకు స్వయముగా గానీ లేదా న్యాయవాది గారి ద్వారా గానీ హాజరై తమకు గల అభ్యంతరములు తెలియపరచవలెను. లేనియెడల కోర్టు వారు సదరు దావాను మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

సుంకర నాగశ్రీనివాసరావు,
శ్రీమతి సుంకర శిరీష, శ్రీమతి తెల్లం దీప్తి
కుమారి లింగాల సాయిహర్షిత
న్యాయవాదులు
పోరంకి, సెల్: 9391511611

మహారాజశ్రీ నూజివీడు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
<u>ఇ.పి. నెం. 27/2012</u> ఇన్ <u>ఒ.ఎస్. నెం. 129/2009</u>

బిట్వీన్:
గాదె కోటిరెడ్డి **-డి. హెచ్. ఆర్**

మరియు

అప్పిడి రాజారెడ్డి **-జె. డి. ఆర్**

పై తెలిపిన జె.డి.ఆర్.కు చెందిన ఈ దిగువ తెలిపిన ఆస్తిని శ్రీ కోర్టు వారు పై తెలిపిన ఇ.పి. బాకీ నిమిత్తంగా **ది. 18-06-2024వ తేదీన ఉదయం 10.30 ని॥ల** లగాయితూ బహిరంగ వేలం వేయుదురు. కావున పాటదారులు సదరు తేదీన వేలమునకు హాజరయ్యి పాడుకొనవచ్చును.

<u>షెడ్యూలు</u>

కృష్ణా జిల్లా, ప్రస్తుతం ఎన్.టి.ఆర్. జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రారు యిలాకా, మైలవరం మండలం, దాసుళ్లపాలెం గ్రామములోని ఆర్.ఎస్. నెంబరు 131/3 దాఖలా 3-32 సెంట్లు మెరక భూమి, పై తెలిపిన జె.డి.ఆర్. యొక్క సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో వుండి, యీ బాకీ క్రింద జప్తు కాబడి, వేలం కాబడుచున్న ఆస్తికి హద్దులు.

తూర్పు: పి.వెంకట శ్రీలక్ష్మి గారి భూమి.
దక్షిణం: ఎ.రాజారెడ్డి గారి భూమి.
పడమర: సిహెచ్.వెంకటేశ్వర రెడ్డి గారి భూమి.
ఉత్తరం: బి.వనిత గారి భూమి.

<u>డి. హెచ్. ఆర్. విలువ: రూ. 6,00,000/-లు</u>
<u>అమీనా విలువ: రూ. 6,00,000/-లు</u>

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గంగవెల్లి రాంబాబు
డి. హెచ్. ఆర్. తరపు న్యాయవాది
నూజివీడు నూజివీడు
తేది: 30-05-2024 సెల్: 8520995988

పేరు మార్పు

KAILA SOUMYA RAJU (పాత పేరు) తండ్రి : వీరవర్ధనరాజు అను నేను కేరాఫ్ నీలా ప్రకాశరావు, డోర్ నెం.1-41, కోటగిరిలంక గ్రామం, అవనిగడ్డ మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా వాస్తవ్యురాలను. నా పేరు **KAILA SAUMYA RAJU** గా మార్చుకున్నాను. ఇక నుండి నాపేరు **KAILA SAUMYA RAJU** గా గమనించగలరు.

IN THE COURT OF THE 3rd ADDL. JUNIOR CIVIL JUDGE, AT VIJAYAWADA
E.P. no. 47/2023 OS No. 768/2022

Between :
Narayansetti Anjaneyulu ....DHR
And
Lakkavarapu Balaji S/o Siva Rama Durga Rao, R/o D.No. 2947/B, NSC Bose Nagar, Kandrika, Vijayawada-15. ...1st JDR

పై నెంబరు వారంటు అమలు పిటీషన్‌ను 1st JDR పై శాలరీ అటాచ్‌మెంట్ నిమిత్తం దాఖలు చేయగా శ్రీ కోర్టువారు సదరు 1st JDRకు నోటీసు నిమిత్తం వాయిదా ది. 28-6-2024వ తేదీకి వేసినారు. కావున సదరు 1st JDR పైన ఉదహరించిన శ్రీ కోర్టునందు హాజరై ఆక్షేపణలున్న తెలుపుకొన గలరు. లేనిచో పరోక్షమున తీర్మానించబడును.

Vijayawada **A.Simha Chalam,**
Dt.27-5-2024 **Advocate for DHR**

<u>పత్రికా ప్రకటన</u>

మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
<u>E.P. No. 3/2024</u> in <u>O.S. No. 211/2009</u>

<u>Between:</u>
Sri Y.Mohan Babu (died) per LR□s
...DHR□s/ Plaintiffs
AND
1. Smt. Dandamudi Sakuntala
2. Smt. Mallineni Vimala Kumari
...JDR□s/ Defendants

<u>2వ JDR:</u>
శ్రీమతి మల్లినేని విమలకుమారి, భర్త: రామకృష్ణ, స్త్రీ, వయస్సు 63 సంవత్సరాలు, డోర్ నెం. 72-22-1, కోనేరువారి వీధి, మిల్క్ బజార్, పటమట, విజయవాడ (అర్బన్).

పై నెంబరు డిక్రీ అమలు పిటీషన్‌లో డిహెచ్‌ఆర్స్ మీకు అనగా 2వ జేడిఆర్‌కు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి నుండి నోటీసులు మీకు పంపినప్పటికి మీరు ఉద్దేశ్యపూర్వకముగా నోటీసులను తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున పై నెంబర్ E.P. లో మీకు నోటీసులు అమలు నిమిత్తం ఈ పత్రికా ప్రకటన ద్వారా అమలు చేసే విధంగా ఆర్డర్ పొందియున్నారు. అందుపై మీ తరపున వాదనను, కౌంటర్ వగైరాలు దాఖలు చేసుకొనుటకు లేదా వినిపించుకొనుటకు మీ హాజరు నిమిత్తం స్వయముగా గానీ, సంపూర్ణముగా సంజాయిషీ పొంది అన్ని ప్రశ్నలకు వుత్తరములు చెప్పకూడిన ప్లీడర్ గారి ద్వారా గాని, అటులనే మీ అనుమతి పొందిన ఒక వ్యక్తి ద్వారా గాని సదరు డిక్రీ అమలు పిటీషన్‌పై ప్రత్యుత్తరములు చెప్పగలందులకు పై కేసును **ది. 2024న జూన్ నెల 26వ తేదీ ఉదయం 10.30 గంటలకు (ది. 26-06-2024)** ఈ కోర్టులో హాజరగుటకున్న ఆరోజున డిక్రీని మీపై ఎందుకు అమలు చేయకూడదో వుదహరిస్తూ శ్రీ కోర్టు వార్కి కౌంటర్ వగైరాలు దాఖలు చేయు నిమిత్తం కేసును వాయిదా వేసినందున మీకు తెలియచేయడమైనది. పైన చెప్పబడ్డ దినమందు మీరు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్షమందు వాజ్యమును విమర్శ చేసి తీర్మానించమగునని ఈ పత్రిక ప్రకటన ద్వారా తెలియచేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

<u>వాయిదా తేది: 26-06-2024</u>

దశిక మురళీకృష్ణ
కరుటూరి రామకృష్ణ
ఏలూరు అడ్వకేట్స్, సెల్: 7386335599

పొరపాట్లు జరగకుండా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు



కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): పొరపాట్లకు అవకాశం లేకుండా ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సక్రమంగా చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డికే బాలాజీ ఎన్నికల అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం ఆయన కలెక్టరేట్లోని స్పందన సమావేశపు మందిరంలో ఎన్నికల అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై ఆచరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీలో జూన్ 4వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని అనంతరం 7 నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. పార్లమెంటు నియోజకవర్గం కౌంటింగ్ హాలు వద్ద ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ఇందుకోసం 14 టేబుళ్ళు ఏర్పాటు చేస్తున్నామని, ఒక్కో టేబుల్ కు 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్ కు పోటీ చేస్తున్న అభ్యర్థుల తరఫున కౌంటింగ్ ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఆయన వివరిస్తూ ఇందులో రెండు కవర్లు ఉంటాయని, బయటి కవర్ను ఫారం 13-సి గా పిలుస్తారని, దానిని తెరిచిన తర్వాత రెండు డాక్యుమెంట్లు ఉంటాయని, అందులో ఒకటి డిక్లరేషన్ 13-ఎ, ఇంకొకటి 13-బి కవరులో వాస్తవ పోస్టల్ బ్యాలెట్ ఉంటుందన్నారు.డిక్లరేషన్ 13-ఎ లో తప్పనిసరిగా ఓటరు సంతకం చేసి ఉండాలని, దానితోపాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించి సంతకం చేసి స్టాంపు వేయడం లేదా హోదాని రాసి ఉండాలని, అలా ఉంటేనే అది చెల్లుబాటు బ్యాలెట్ ఓటుగా పరిగణించాలన్నారు.చెల్లుబాటుకాని ఓట్లు ఏవైనా ఉంటే 13-సి కవర్లో ఉంచి తిరస్కరిస్తూ వేరుగా పెట్టెలో ఉంచడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి షాహిద్ బాబు, శిక్షణ నోడల్ అధికారి మురళీ కిషోర్, ఏఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.



2న పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ: మాజీ మంత్రి యెర్నేని సీతాదేవి కుటుంబ సభ్యులను బుధవారం సంయుక్త కిసాన్ మోర్చ జాతీయ కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు, రాష్ట్ర రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పరామర్శించారు. ఈ సందర్భంగా తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి చల్లగుళ్ల సుబ్రహ్మణ్యంతో కలిసి గుడివాడలోని క్లబ్ సెంటర్లో విలేకర్లతో మాట్లాడారు. తాను రచించిన పుస్తకం 'అవినీతి చక్రవర్తి నరేంద్రమోడీ' పుస్తకాన్ని వచ్చే నెల 2వ తేదీన విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో పరకాల ప్రభాకర్ ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి ఉచిత శిక్షణ


ప్రజాశక్తి-గుడివాడ: ఈ నెల 30, 31 తేదీలలో గుంటూరు జిల్లా తుళ్లూరు మండం నెక్కల్లు గ్రామంలో అబ్బూరి కోటేశ్వరరావు జ్ఞానమందిరంలో డా ప్రత్యూష సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచిత వక్త శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సివి రామన్ ఐఐటి ఫౌండేషన్ వ్యవస్థాపకులు నార్ని వెంకటరామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి ఉచితంగా వసతి, భోజన సదుపాయం కల్పించినట్లు తెలిపారు.

రైతులందరికీ నష్టపరిహారం అందిస్తాం

వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పెడన: మిచౌంగ్ తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి జీవి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ లోని వ్యవసాయ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది డిసెంబర్లో కురిసిన అకాల వర్షాలు కారణంగా నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం అందించే సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం మండలంలోని బల్లిపర్రు పంచాయతీ పరిధిలోని సింగరాయపాలెం గ్రామంలో కొంతమంది రైతులు పేర్ల నమోదులో అవకతవకలు జరిగాయన్న విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. బల్లిపర్రు పంచాయతీతో పాటు మండలంలోని మిగిలిన 23 పంచాయితీల్లోనూ ఆయా గ్రామాల్లో ఉన్న సచివాలయాల్లో రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. గతంలో తప్పుడు నివేదికలు అందించిన ఆయా గ్రామాల వీఆర్వో, వీఆర్ఓ లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వీటిపై మరో రెండు మూడు రోజుల్లో విచారించి సంబంధిత అధికారులపై సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా అర్హులైన ప్రతి ఒక్క రైతుకు విచారించి నష్టపరిహారం అందేలా ప్రణాళిక రూపొందిస్తామన్నారు. మండల పరిధిలోని మండల పరిధిలోని ఆయా గ్రామాల రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వైబి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-ఉయ్యూరు: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యలమంచిలి వెంకట బాబూ రాజేంద్రప్రసాద్ పుట్టినరోజు వేడుక బుధవారం వైభవంగా నిర్వహించారు. ఉయ్యూరు పట్టణ, మండల టీడీపీ నాయకులు, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పలుచోట్ల ఏర్పాటు చేసిన జన్మదినోత్సవ వేడు కల్లో పాల్గొని రాజేంద్రప్రసాద్ కేక్ కట్ చేశారు. పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్ల సంఘం ఆధ్వర్యంలో రాజేంద్రప్రసాద్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఉయ్యూరు మాజీ చైర్మన్లు జంపాన పూర్ణచంద్రరావు, ఖుద్దూస్, కౌన్సిలర్లు పలియాలశ్రీనివాస్, పరిమి సలోమి సంతోషి, టి. పద్మావాతి, బీసీసెల్ నాయకుడు రాజులపాటి ఫణి, బూరెల నరేష్, వల్లూరు కిరణ్, జంపన వీరశ్రీని వాస్, అజ్మతుల్లా, ఆకునూరు సర్పంచ్ గోలి వసంతకుమార్, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



డ్రెయిన్లు బాగు చేయాలి

ప్రజాశక్తి-బంటుమిల్లి: నాగేశ్వరావుపేట డ్రైను నాగేశ్వరావుపేట గ్రామం నుండి బంటుమిల్లి, పెందుర్రు మునిపెడ గ్రామాల మీదుగా మల్లంపూడి డ్రైన్లో కలుస్తుంది. ఇది సుమారు 12 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. దీని కింద దాదాపు 5 వేల ఎకరాలు భూములు ఉన్నాయి. ఈ మురుగు కాలవ గత కొన్ని సంవత్సరాల నుండి తవ్వకపోవటం వలన, పూడిక, ఆక్రమణలకు గురి యై ప్రతి సంవత్సరం భారీ వర్షాలు వచ్చినప్పుడు, తుఫాను వచ్చిన సందర్భాల్లోనూ మురుగు, ముంపు నీరు స్తంభించిపోయి వేలాది ఎకరాలు ముంపు గురియై వివిధ దశల్లో రైతులకి అపార నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. గత సంవత్సరం మిచౌంగ్ తుఫాను సందర్భంలో అక్కడక్కడ తూడు, పిచ్చి మొక్కలు తొలగించడం జరిగిందని రైతులు చెబుతున్నారు. ఈ సందర్భంగా డ్రైన్లను పరిశీలించిన జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి మురుగు కాల్వలు ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాల నుంచి పట్టించుకోకపోవడం, అక్కడక్కడ ఆయా సందర్భాల్లో తూడు తొలగించడం వలన ఉపయోగం లేదని ,అందువలన ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి వెంటనే తవ్వించి రైతుల, కౌలు రైతుల పంటపొలాలకు నష్టం, ఇబ్బందేమీ లేకుండా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంలో బంటుమిల్లి మండల రైతు సంఘం కార్యదర్శి లంకదాసుల అజయ్ ఘోష్, రైతు సంఘం సీనియర్ నాయకులు సుజ్ఞానం జనార్ధన్‌రావు, కైలా శ్రీ రామాంజనేయులు, కైలా లక్ష్మణరాజు, బొల్లా శ్రీనివాసరావు, గౌరిశెట్టి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

1న ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: ఒకటో తేదీ శనివారం మండల కేంద్రమైన గుడ్లవల్లేరులోని డాక్టర్ సిఎల్ వెంకట్రావు జన్మభూమి మెడికల్ సెంటర్ నందు ప్రముఖ వైద్యులచే ఉచిత వైద్యశిబిరం,మరియు ఉచిత మందులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో ఈసీజీ పరీక్ష, ఏకో గుండె స్కానింగ్, బ్లడ్ షుగర్ పరీక్షలు, 4 విభాగాలకు సంబంధించిన వ్యాధులకు ఆరోగ్యశ్రీలో ఉచిత వైద్యము,మరియు సెయింట్ జోసెఫ్ ఏలూరు వారు దంతవైద్య శిబిరంలో దంతాలను పరీక్ష చేసి తగిన సలహాలు మరియు మందులు పంపిణీ చేస్తారు. డాక్టర్ సి.యల్ వెంకటరావు పర్యవేక్షణలో జరిగే ఈ వైద్య శిబిరాన్ని తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల, కొడాలి, శ్రీకాకుళం గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలను బుధవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో భాగంగా విద్యార్థిని విద్యార్థుల చేత కథల పుస్తకములు చదివించటం వారి చేత కథలు చెప్పించుట జరుగుచున్నది. అనంతరం విద్యార్థినీ విద్యార్థులకు యోగ పై అవగాహన కార్యక్రమం మరియు మ్యూజికల్ చైర్ పోటీలను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు శరత్ కుమార్, దారా సుజాత, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.



పిల్లలకు పోషకాహారాన్ని అందించాలి



మాట్లాడుతున్న విద్యా శాఖాధికారి సాంబశివరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు: నాణ్యమైన పోషకాహారాన్ని పిల్లలకు అందించాలని మండల విద్యాశాఖ అధికారి-2 జె.సాంబశివరావు అన్నారు. బుధవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు అమలు జరపాల్సిన మెనూ, వంట చేయాల్సిన విధానాన్ని డిజిటల్ క్లాసుల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూను తప్పక పాటించాలని అమలు జరపటంలో నిర్లక్ష్యం వలదని సూచించారు, ఈ సందర్భంగా మెనూ వివరాలను వివరించారు సోమవారం గుడ్డు కూర ,చిక్కి, గుడ్డు ఆహారంగా ఇవ్వాలని, మంగళవారం చింతపండు పులిహోర దొండకాయ చట్నీ, రాగి జావా ,గుడ్డు అందించాలన్నారు బుధవారం వెజిటబుల్ రైస్, ఆలూ కుర్మా ,చిక్కి, గుడ్డు పెట్టాలన్నారు, గురువారం నిమ్మకాయ పులిహోర, సాంబార్ బాత్, చట్నీ, రాగి జావా, గుడ్డు ఇవ్వాలన్నారు, శుక్రవారం వైట్ రైస్, ఆకుకూర పప్పు ,చిక్కి, గుడ్డు ఇవ్వాలన్నారు శనివారం గ్రీన్ రైస్, సాంబారు, స్వీట్ పొంగల్, రాగిజావ అందించాలన్నారు. ఈ మెనూ ప్రతి ఒక్కరు పాటించాలని దీనిలో ఉపయోగించవలసిన ఇంగ్రిడియన్స్ లో రాజీ పడవద్దని హెచ్చరించారు. అనంతరం కార్మికుల మధ్య వంట నిర్వహణ పోటీలు నిర్వహించారు ప్రథమ స్థానం తేలప్రోలు, ద్వితీయ స్థానం ఉంగుటూరు, తృతీయ స్థానం చాగంటిపాడు వారిని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ఉంగుటూరు ప్రధానోపాధ్యాయిని సిహెచ్ అనిత అమ్మ అన్నగారు శ్రీరామ్ సిఆర్పిలు వివిధ పాఠశాలల వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, నరసన్నాయుడు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధానాన్ని పై విధంగా అధికారులు వివరించగా నిర్వాహకుల సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల పిల్లలకు రూ 5.47, జిల్లా పరిషత్ హైస్కూల్ పిల్లలకు రూ.8.57గా ప్రస్తుతం ఒకరికి మెనూ చార్జిగా చెల్లిస్తున్నారని ఇప్పుడు అమలు జరపవలసిన మెనూ ధరలకు అనుగుణంగా కనీసం రూ.20 చెల్లించాలని నిర్వహణకు అవసరమైన నగదు ముందస్తు చెల్లింపులు జరపాలని ఉమ్మడి రాష్ట్రంలో ఇలా జరిగిందని రాష్ట్ర విభజన అనంతరం దానిని విస్మరించారని మరలా ముందస్తు చెల్లింపులు తిరిగి ప్రారంభించాలని సంఘం నాయకులు కోరుతున్నారు . ఇప్పుడు ఉన్న నిత్యావసర వస్తువుల ధరలు పరిగణలోకి తీసుకొని మెనూ చార్జిగా మేము కోరుతున్న ధరను అమలు చేయాలని, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పదివేల రూపాయలు వేతనంగా ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆర్‌టిసి బస్ డ్రైవర్‌ను కొట్టిన కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : విజయవాడ వాంబే కాలనీకి చెందిన చుక్కాలా శ్రీనివాసరావు 2009 వ సంవత్సరం నుండి ఎపిఎస్‌ఆర్‌టిసిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వివరాల ప్రకారం... ప్రస్తుతం గవర్నర్ పేట 1 డిపోలో పని చేస్తున్నాడు. ఎపిఎస్‌ఆర్‌టిసి డ్రైవర్ శ్రీనివాసరావు AP 29Z 0148 కార్గో బస్సు తీసుకొని మే 28న వరంగల్ నుండి సాయంత్రం మంగళగిరికి బయలుదేరాడు. మార్గ మధ్యలో ఇబ్రహీంపట్నం దగ్గరకు వచ్చేసరికి ఇబ్రహీంపట్నం గ్రామంలో కారు లారీ ఆక్సిడెంట్ అయ్యి ట్రాఫిక్ ఆగిపోయింది. అంతట ఫిర్యాది కూడా కార్గో బస్సుతో ట్రాఫిక్‌లో ఆగిపోయాడు. నిదానంగా ట్రాఫిక్ కదులుతుంటే ఫిర్యాది తన బస్సును మెల్లగా నడుపుతుండగా తనకు సైడ్ ఇవ్వలేదని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులు ఫిర్యాదితో గొడవ పడ్డారు. ఒకరిని ఒకరు తిట్టుకున్నారు. అక్కడ నుండి బస్సును ముగ్గురు వ్యక్తులు బైక్‌తో వెంబడించి ఇబ్రహీంపట్నం రింగ్ దాటిన తర్వాత అక్కడ ఉన్న కాలువ దాటిన తర్వాత బస్సు ముందు బైక్‌ను అడ్డుగా పెట్టి డ్రైవర్ క్యాబిన్‌లోకి వెళ్లి దాడి చేశారు. దీంతో ఫిర్యాదికి బలమైన గాయాలవడంతో మే 29న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ముద్దాయిలు అయిన పాకలపాటి సన్నీబాబు, యాదల వెంకట బాబు, తోటపల్లి గోపిలను సిసి ఫుటేజ్ ద్వారా గుర్తించి, అరెస్ట్ చేసి ముద్దాయిలపై రౌడీ షీట్ ఓపెన్ చేశారు.

భానుడి ప్రతాపం... అల్లాడిన జనం

ప్రజాశక్తి కంచికచర్ల : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా బుధవారం భానుడి ప్రతాపానికి జనం విలవిల్లాడారు. విజయవాడ, నందిగామ, కంచికచర్ల, జగ్గయ్యపేట, మైలవరం, అన్ని ప్రాంతాల్లో ఎండ తీవ్రత విపరీతంగా పెరిగింది. మధ్యాహ్న సమయంలో ఎండ తీవ్రత 47 డిగ్రీలకు చేరింది. దీంతో తీవ్ర ఉక్కపోతకు జనం అల్లాడిపోయారు. ఉదయం 9 గంటల నుండి గంట గంటకూ ఎండ తీవ్రత పెరిగింది. గాలి ఆడక వెచ్చదనానికి పిల్లలు, వద్ధులు తట్టుకోలేక పోయారు. ఎండ తీవ్రతకు జనం బయటకు రాలేకపోయారు. వారం రోజులుగా కొద్దిగా చల్లబడ్డ వాతావరణం, మళ్లీ ఎండ తీవ్రత పెరగటంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. రోహిణి తీవ్రత అంటే ఇలా ఉంటుందా అని జనం అంటున్నారు. ఇళ్లల్లో సైతం ఫ్యాను గాలి వెచ్చగా ఉండటంతో జనం అల్లాడిపోయారు. సాయంత్రం 6 గంటలు దాటినా వెచ్చటి వడగాలి తగ్గలేదు. రాత్రిపూట 9 గంటల సమయంలో కూడా గాలిలేక ఉక్కపోతకు జనం అల్లాడిపోయారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : భారత కమ్యూనిస్టు పార్టీ మార్సిస్టు 12 13 14 డివిజన్ల శాఖల ఆధ్వర్యంలో కార్మిక సమస్యల పరిష్కరించాలని కోరుతూ జెసి శివరామకృష్ణను కలిసి వినతిపత్రం అందించినట్లు సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.కృష్ణ, వి.గురుమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ ప్రారంభించి నిర్మాణం చేసి ఎన్నో రోజులవుతుందని అయినప్పటికీ దాన్ని ఇంతవరకు ప్రారంభించలేదని అన్నారు. వాటర్ ట్యాంక్‌ను వెంటనే ప్రారంభించి ఈ ప్రాంతంలో ఉన్న ప్రజానీకం అంతటికీ మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని కోరినట్లు తెలిపారు. రోడ్లన్నిటినీ రిపేరు చేయమని ముఖ్యంగా వాటర్ కనెక్షన్ హౌస్ కనెక్షన్ కోసం తీసుకున్న సందర్భంలో రోడ్లు తవ్వేసి వదిలేశారన్నారు. దీంతో ఆ రోడ్లన్నీ గోతులు ఏర్పడ్డాయని వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర సభ్యులు పి.కృష్ణ, నగర కమిటీ సభ్యులు వి.గురుమూర్తి, లోకల్ కార్యదర్శి శాఖ కార్యదర్శి డి.రవీంద్రబాబు, స్థానిక నాయకులు, సిఐటియు నగర అధ్యక్షులు రాజు, డివైఎఫ్ఐ నాయకులు శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బోధనా పద్ధతులు మెరుగుపర్చుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అధ్యాపకులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమ బోధనా పద్ధతుల్లో మెరుగులు దిద్దుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.బాబూరెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యంలో 'తరగతి గదిలో సమగ్ర బోధనా పద్ధతులు' అంశంపై సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా హాజరైన డాక్టర్ ఎం.బాబూరెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా అన్ని రంగాల్లోనూ విప్లవాత్మకమైన మార్పులు, అభివృద్ధి చోటు చేసుకుంటుందన్నారు. ఆ క్రమంలో విద్యారంగంలోనూ మార్పులు అనివార్యమైం దన్నారు. విద్యార్థులు పోటీ ప్రపంచంలో చక్కగా రాణించే దిశగా వారిని తీర్చిదిద్దాల్సిన అవసరముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల్లో ఉన్న అంశాలతో బోధన చేస్తే సమగ్రంగా ఉండదన్నారు. ఆయా రంగాల్లో వస్తున్న మార్పులు, అభివృద్ధి, అధ్యయనం వంటి అనేక అంశాలను విద్యార్థులకు తెలియజేసే దిశగా బోధనా పద్ధతుల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. ఆ దిశగా అధ్యాపకులు తమనుతాము తీర్చిదిద్దుకోవాలని కోరారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో అనేక మార్పులను అధ్యాపకులు ఆహ్వానించాలన్నారు. మౌలికమైన అంశాలతో పాటు సమకాలీన పద్ధతులను జోడించుకొని అధ్యాపకులు తమ బోధనను కొనసాగించాలన్నారు. తద్వారా విద్యార్థులకు అత్యంత మేలు కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామకృష్ణ, అధ్యాపకులు షమీమ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.బాబూరెడ్డి

వసుంధర భరతనాట్య అరంగేట్రం



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : భారతీయ శాస్త్రీయ నాట్యాలలో భరత ముని పేరిట ఆవిర్భవించి ప్రసిద్ధి చెందిన దక్షిణాత్యా నాట్యం భరతనాట్యం. వల్లభనేని శ్రీలక్ష్మి వసుంధర శ్రద్ధాభక్తులతో, అకుంఠిత దీక్షతో కృషి చేసి పూర్తిస్థాయిలో ప్రదర్శననిచ్చిన భరత నాట్యారంగేట్రం ఆహూతులను సమ్మోహితులను చేసింది. పాటలకు గీతాలకు లయాత్మకంగా అడుగులు వేయడం తల్లితండ్రులు డాక్టర్ వల్లభనేని వంశీ, డాక్టర్ పంకజశ్రీ గమనించి వసుంధరకు గత నాలుగు సంవత్సరాలుగా భరతనాట్యం నేర్పిస్తున్నారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం వసుంధర భరతనాట్య అరంగేట్రం నయన మనోహరంగా సాగింది. వారసత్వంగా వస్తున్న నాట్య సంపదను పరిరక్షించుకుంటూ వస్తున్న కుటుంబాలలో భాగవతుల యజ్ఞనారాయణశర్మ కుటుంబం ఒకటి. వారి కుమారులు భాగవతుల వేంకటరామశర్మ, వారి కుమార్తె సౌమ్యల దగ్గర సుశిక్షణలో వసుంధర నాట్యాభ్యాసం చేస్తూ పూర్తిస్థాయిలో ప్రదర్శననిచ్చి అందరి ప్రశంసలం దుకుంది. వయోలిన్‌తో పాలపర్తి ఆంజనేయులు, వీణతో కె.శశిధర్, వేణువుతో ఎస్‌కె.బాబు, మృదంగంతో బి.సురేష్ బాబు ఆమె నాట్యానికి నిండుదనాన్ని చేకూరుస్తూ సహకరించారు. గురుసత్కారం అదే వేదికపై వసుంధర తనకు భరతనాట్య శిక్షణ నిచ్చిన గురువులకు సంప్రదాయబద్ధంగా గురు పూజ చేసి ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి వల్లభనేని వంశీ ఆత్మీయులు సన్నిహితులు, చిన్ననాటి స్నేహితుడు ఎమ్మెల్యే కొడాలి నాని వంగవీటి రాధ తదితర మిత్రులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.

తిరువూరు కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - తిరువూరు : చైర్‌పర్సన్ గత్తం కస్తూరి భాయి అధ్యక్షతన బుధవారం జరిగిన తిరువూరు నగర పంచాయతీ పాలకవర్గ సమావేశం వాడి వేడిగా జరిగింది. పట్టణ సమస్యలపై పాలక, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎన్నికల నిబంధనల సాకుతో మంచినీటి సరఫరా కుంటు పడిందని, తాగునీటి సరఫరా పూర్తి స్థాయిలో కావట్లేదని పాలకవర్గంపై ప్రతిపక్ష సభ్యులు షేక్ అబ్దుల్ హుస్సేన్, నాళ్ల సురేంద్ర, జీడిమళ్ళ సత్యవతి ఆరోపించారు. పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందన్నారు. ఎండిఒ కార్యాలయం వద్ద కల్వర్ట్ రిపేర్ చేపట్టక పోవటంతో సభ్యులు మధ్య తీవ్ర వాగ్వివాదం. దీనిపై ఎఇ ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని సభ్యులు అనడంతో ఎఇ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది.



ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థుల కళాఖండాలు

కాగితాలు, ఆకులతో కళాఖండాలు

విజయవాడ : గవర్నర్ పేటలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం సందర్భంగా సాహెరచే కాగితాలు, ఆకులతో కళాఖండాలు తయారీలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నప్పుడు వర్షం వస్తే కాగితాలతో పడవలు చేసి నీటిలో వదిలి ఎంజాయ్ చేశామని గుర్తు చేసుకున్నారు. కాస్త పెద్దయ్యాక కాగితాలతో రెక్కల విమానం, రాకెట్లు చేసి గాలిలో గింగిరాలు కొట్టించామన్నారు. పేపరుతో కటింగ్‌లు ఇచ్చి క్లాస్ రూం డెకరేషన్ చేశామని చెప్పుకొచ్చారు. అదే కాగితాలతో కెమెరాలు, తదితర విచిత్ర ఆకృతులు ఎన్నో చేశామన్నారు. చిన్నపిల్లలకు కత్తెర, కాగితం ఇస్తే చాలు ఏదేదో చేసి సంతోషిస్తారన్నారు. ఇటువంటి పేపర్ క్రాఫ్ట్ ద్వారా చిన్నారుల్లో గల సృజనాత్మకత వెలికితీసి వారిని ప్రోత్సహిస్తే అద్భుత కళాఖండాలు వస్తాయని అన్నారు. అనంతరం ఆకులు, కాగితాలతో రకరకాల ఆకృతులు చేసి విద్యార్థులచే తయారు చేయించారు. గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు. చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయం సత్య నారాయణ పురంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా బుధవారం ఉదయం మొదటిగా విద్యార్థులచే పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు, నీతి కథలు చదివించి చెప్పించారు. అనంతరం రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ టి.సుబ్బన్న గణితంలో శిక్షణ ఇచ్చారు. టీచర్ కె.కనకదుర్గా దేవి జనరల్ నాలెడ్జ్ శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి భారతదేశం చరిత్ర బేసిక్స్ గురించి శిక్షణ ఇచ్చారు. అనంతరం కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ టీచర్ ఎం.అనురాధ విద్యార్థులకు దేశభక్తి గీతాలు, సిపాయిల తిరుగు బాటులో శిక్షణ, వాటి భావాలను తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగి ఆర్.శ్రీనువాస్ స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ ఇచ్చారు. బాలల పుస్తక విభాగం నుండి దేశ నాయకుల చరిత్రలు, నీతి కథలు, సామెతలు, జోక్స్, మేథమేటిక్స్ తదితర పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడారు.

డ్రాయింగ్, చెస్‌లో శిక్షణ

కంచికచర్ల : విజ్ఞానాన్ని పెంపొందించేదుకు గ్రంథాలయాలు దోహదపడతాయని కంచికచర్ల శాఖ గ్రంథాలయాధికారి అల్లూరి రామచంద్రుడు అన్నారు. కంచికచర్ల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి బుధవారం ఆయన మాట్లాడారు. వేసవి విద్యార్థులకు విద్యాబోధన చేసేందుకు ముందుకు వచ్చిన సిబ్బందిని అభినందించారు. డ్రాయింగ్ మాస్టర్ సర్వేశ్వరరావు విద్యార్థులకు కుక్క (పప్పీ) బొమ్మ డ్రాయింగ్ నేర్పించారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ నుండి యోగా మాస్టర్ మేడూరి మాణిక్యాలరావురావు యోగాసనాలు విద్యార్థులకు నేర్పించారు. ఎమ్.కనకారావు విద్యార్థులకు క్రాఫ్ట్ వర్క్ నేర్పించారు. డాన్స్ మాస్టర్ బిట్ర రాహుల్ కుమార్ విద్యార్థులకు డాన్స్ నేర్పించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. విద్యార్థులకు చెస్ నేర్పించారు.



చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

దుర్గమ్మను దర్శించుకున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మను సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా దంపతుల వారు బుధవారం ఆలయానికి విచ్చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వీరికి ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



పొక్లెయినర్‌తో కూల్చివేస్తున్న నిర్మాణాలు

అక్రమ నిర్మాణాలు కూల్చివేత

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పారిశ్రామికవాడలోని ఎన్‌ఎస్‌పి కాలువపై ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను ఎన్‌ఎస్‌పి అధికారులు బుధవారం కూల్చివేశారు. ఎన్‌ఎస్‌పి కాలువలను ఆక్రమించి పరిశ్రమల యజమానులు నిర్మించిన భవనాలను కొన్నేళ్ల క్రితం ఎన్‌ఎస్పీ కాలువను ఆక్రమించి షెడ్లు, భవనాలు నిర్మించారు. దీనిపై ఎన్‌ఎస్పీ అధికారులు లోకాయుక్తను ఆశ్రయించారు. ఆక్రమ నిర్మాణాలు తొలగించా ల్సిందిగా లోకాయుక్త ఆదేశాలు జారీ చేసినా పెడ చెవిన పెట్టడంతో అధికారులు పొక్లెయిన్‌తో అక్రమ నిర్మాణాల కూల్చివేశారు.

హోటల్ యజమానులతో పోలీసుల సమావేశం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పోలీస్ కమీషనర్ పిహెచ్‌డి.రామకృష్ణ ఆదేశాల మేరకు విజయవాడ వెస్ట్ జోన్ డిసిపి టి.హరి కృష్ణ పర్యవేక్షణలో విజయవాడ వెస్ట్ డివిజన్ ఏసీపీ పి.మురళి కృష్ణ రెడ్డి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.దుర్గా శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జూన్ 4న జరగబోవు జనరల్ ఎలక్షన్స్-2024 కౌంటింగ్ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో ఉన్న హోటల్స్, కళ్యాణ మండపాలు, టీ స్టాల్‌ల యజమానులతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం సమావేశం జరిగింది. కౌంటింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని విషయాలు గురించి స్పష్టంగా తెలిపారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు సహకరించాలని ఎసిపి కోరారు. ఈ కార్యక్రమంలో విజయవాడ వెస్ట్ డివిజన్ ఎసిపి పి.మురళి కృష్ణారెడ్డి, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి.దుర్గాశేఖర్ రెడ్డి, ఎస్ఐలు వి.రమ్య శ్రీ సత్య, కె.శారద, సతీష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

భూమికి అమృతం... పచ్చిరొట్ట సాగు



ప్రజాశక్తి-గన్నవరం

నియోజకవర్గంలో మాగాణి పొలాల్లో వేసవికాలంలో పచ్చిరొత్త పైరులు సాగుతో పొలాల్లో సారవంతాన్ని పెంచుకోవచ్చునని, తద్వారా రసాయనిక ఎరువులు తగ్గించుకోవచ్చునని వ్యవసాయాధికారులు చెప్పడంతో రైతులు మాగాణి పొలాలలో పచ్చిరొట్ట పైర్ల పెంపకానికి ఆసక్తి కనబరుస్తున్నారు. గతంలో అధికంగా రసాయనక ఎరువులు, పురుగు మందులు వాడకంపై ఉత్సాహం కనిపించే రైతులు గత నాలుగైదు సంవత్సరాలుగా ప్రకతి వ్యవసాయంపై ఆసక్తి పెరుగుతోంది. పచ్చిరొట్ట పైర్లు పచ్చి రొట్ట ఎరువులు వాడకం క్రమేపి పెంచుతున్నారు. గతంలో విచక్షణ రహితంగా రసాయనకు ఎరువులు వాడటం వలన భూసారం పడిపోవడంతో పూర్వ సాంప్రదాయాన్ని అమలు పరుస్తున్నారు. దీనిలో భాగంగానే జీలుగ, పిల్లి పెసర, జనుము, అలసంద, ఉలవ, నీలిలాంటి పచ్చిరొట్ట పైరులనుసాగు చేయడానికి ముందుకు రావడంతో వ్యవసాయాధికారులు సైతం వారిని ప్రోత్సహిస్తున్నారు. ఆ పైరులు పూతదశకువచ్చిన తర్వాత ఆ పొలాల్లో నీరు నిలవబెట్టి ఆ పైళ్లను దమ్ము చేసి మురగనిచ్చి వరి నాటు వేసుకోవాలని అధికారులు సూచనలను తూచా తప్పకుండా పాటించడంలో రైతులు నిమగ్న మవుతున్నారు. వచ్చేరొట్ట పైర్లలో స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాషియం ఉండటంతో పాటు సూక్ష్మపాశకాలు కూడా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇవి పంట ఎదుగుదల దిగుబడికి సహకరిస్తాయని, వీటివల్ల రసాయన ఎరువులు వినియోగం కూడా తగ్గుతుందని తద్వారా రైతు ఆర్థికంగా, భూములు శక్తిని కోల్పోకుండా ఉంటాయి. అలాగే 30శాతంకు పైగా రసాయనికాల వాడకం కూడా తగ్గుతుంది. ఇదే విషయాన్ని గతంలో పూర్వీకులు చెప్పగా పెడచెవిన పెట్టిన రైతులు ప్రస్తుతం అధికారులు ప్రచారాల ద్వారా హెరీరెత్తిస్తుండడంతో ఈ విధానంపై దష్టి సారిస్తున్నారు. పచ్చిరొట్ట పైరు సాగు చేయడం వల్ల భూమి లోపల పొరలలో నిక్షిప్తమైన పోషకాలు వెలికి తెచ్చి పైరుకు అందుతుందని అలాగే భాస్వరం గంధకం అంటే ఫాస్టాలు లభ్యం గణనీయంగా పెరుగుతుందని కలుపు మొక్కలు నాశనం అవుతాయని అధికారులు పేర్కొనడంతో పచ్చిరొట్ట ఎరువుల సాగులో రైతులు నిమగ్నమవుతున్నారు. ఈ దశలో గన్నవరం సబ్ డివిజన్ పరిధిలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో సైతం నూటికి 50 శాతం మంది రైతులు పచ్చిరొట్ట పైరు సాగుపై దష్టి పెట్టారని మండల వ్యవసాయ అధికారి లక్ష్మీ తేజస్వి తెలిపారు.



వివిధ అంశాల్లో బాలలకు పోటీలు

ప్రజాశక్తి-ఉంగుటూరు: గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం మండల కేంద్రములోని గ్రంథాలయంలో పిల్లలకు పుస్తక పఠనం, డ్రాయింగ్, కథలు చెప్పడం, పరుగు పందెం లాంటి పోటీ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రంథాలయ శాఖాధికారి ఉప్పలపాటి చంద్రశేఖర్ మాట్లాడుతూ వేసవిలో పిల్లలకు సెలవులు ఇస్తారు ఇచ్చిన సెలవుల్లో సరదాగా గడపడానికి ఎక్కువ మంది పిల్లలు ఇష్టపడుతున్నారని మరికొంతమంది విహార యాత్రల ద్వారా కొత్త ప్రదేశాలకు వెళ్ళి వాటి వివరాలు తెలుసుకోవడం ద్వారా కొన్ని కొత్త విషయాలను తెలుసుకుంటారని అన్నారు. కానీ చాలా మందికి అలాంటి అవకాశం ఉండదు కనుక మన దగ్గర ఉన్న గ్రంథాలయం నందు వెలకట్టలేని విలువైన సమాచారం క్రోడీకరించి పేద విద్యార్థులకు అందించే బాధ్యతను గ్రంథాలయ సంస్థ తీసుకుని కొత్త కొత్త విషయాలను బోధిస్తూ పలు రకాల సాంస్కతిక కార్యక్రమాలు ఆటలు లాంటివి వేసవి విజ్ఞాన శిభిరం ద్వారా అందిస్తుంది అని దీనిని అందరూ వినియోగించుకోవాలి అని సూచించారు.

వైసిపి నాయకులు సీతారామయ్య మృతి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం మండలం బుద్ధవరం గ్రామం రాజీవ్ నగర్ కాలనీ చెందిన వైసిపి నాయకులు గండికోట సీతారామయ్య (58) బుధవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. మంగళవారం సాయంత్రం అస్వస్థతకు గురికాగా వెంటనే కుటుంబ సభ్యులు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం ఉదయం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

విద్యుద్ఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు వల్లభానగర్ రోడ్డులో మంగళవారం రాత్రి విద్యుద్ఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపట్లజిల్లా తురకపాలెంకు చెందిన కొమరబత్తిన మనోజ్‌కుమార్ (32) ఉయ్యూరులో నివసిస్తూ విజయవాడలో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసి ప్రస్తుతం మరో ఉద్యోగం కోసం చూస్తున్నాడు. మంగళవారం రాత్రి వల్లభానగర్ రోడ్డులో ఫోన్ మాట్లా డుతూ రోడ్డు పక్కన ఉన్న నగరపంచాయతీ వాటర్ సప్లై డైరెక్ట్ పంపింగ్ మోటార్ దిమ్మ పైకూర్చుని వెనుకఉన్న వాటర్ డెలివరీ ఇనుప పైపు ను ఆనుకోగా విద్యుత్ ప్రసరించి అక్కడికక్కడే మృతిచెందాడు. సమచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి బుధవారం పోస్టుమార్టం అనంతరం కుటుం సభ్యులకు అందజేశారు.



క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి

చదువుతో పాటు క్రీడలలో కూడా విద్యార్థులు రాణించాలని చల్లపల్లి విద్యుత్ శాఖ డిఇ పులి నాగేశ్వరరావు అన్నారు. చల్లపల్లి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థి విద్యార్థులకు పుస్తక పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న విద్యుత్ డిఇ నాగేశ్వరరావు మాట్లాడుతూ మానసిక ఉల్లాసానికి, ఆటలు దోహదపడతాయన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆటలలో కూడా ప్రాధాన్యత సాధించాలన్నారు. ప్రతి విద్యార్థి విద్యలో అభివద్ధి చెంది దేశం కోసం పాటుపడాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమాన్ని చల్లపల్లి గ్రంథాలయ శాఖ అధికారి కే గణేష్ పర్యవేక్షించారు.

హజ్ యాత్ర విజయవంతం : కమిటీ

ప్రజాశక్తి-గన్నవరం

2024 పవిత్ర హజ్ యాత్ర విజయవంతం అయిందని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి రాష్ట్ర హజ్ కమిటీ కృతజ్ఞతలు తెలియజేసింది. హజ్ యాత్ర సక్సెస్ మీట్ బుధవారం గన్నవరం ఈద్గా జామా మసీదు హాజ్ క్యాంపులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి, చైర్మన్ హాజ్ ఆపరేషన్స్ శ్రీ హర్షవర్ధన్ మాట్లాడుతూ రాష్ట్ర హాజ్ కమిటీ, వక్ఫ్ బోర్డ్, వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో 2024 హజ్ యాత్ర విజయవంతం అయిందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హాజ్ కమిటీ వివిధ శాఖల అధికారులు సిబ్బందిని అభినందించి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. వక్ఫ్ బోర్డ్ సీఈవో మరియు హాజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, హాజ్ కమిటీ సభ్యులు సిఆర్డిఏ అదనపు కమిషనర్ అలీం బాష , దూదేకుల కార్పొరేషన్ ఎండి గౌస్ పీర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మస్తాన్





వలి, రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాస్, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ ఎం ఎల్ కె రెడ్డి, ఎయిర్పోర్ట్ భద్రతాధికారులు డీఎస్పీలు వెంకటరత్నం, గుప్తా, జయ సూర్య, సెంట్రల్ హాజ్ కమిటీ సభ్యులు బిలాల్ అన్సారి, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

మూడో బృందం పయనం

హజ్ యాత్రను హాజ్ కమిటీ సభ్యులు, దూదేకుల కార్పొరేషన్ ఎండి గౌస్ పీర్ బుధవారం తెల్లవారుజామున గన్నవరం ఈద్గా జామా మసీద్ హాజ్ క్యాంప్ వద్ద పచ్చజెండా ఊపి ప్రారంభించారు. 48 మందితో మూడో బృందం బుధవారం ఉదయం 7:10 గంటలకు విమానంలో జెడ్డా బయలుదేరి వెళ్లింది. వక్ఫ్ బోర్డ్ సీఈవో మరియు హాజ్ కమిటీ ఈవో అబ్దుల్ ఖదీర్, హాజ్ కమిటీ సభ్యులు హజ్ యాత్ర శుభప్రదం కావాలని యాత్రికులకు అభినందనలు తెలిపారు.

లాడ్జీలను తనిఖీ చేసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్ నిర్వహణ, అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యంగా మచిలీపట్నంలోని పలు లాడ్జిలను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా



ఎస్పీ మాట్లాడుతూ జూన్ 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణం లో నిర్వహించేందుకు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఏర్పాటు చేసేందుకు, అసాంఘిక కార్యకలాపాలను నివారించే లక్ష్యంగా ఈ తనిఖీ లు చేస్తున్నట్లు తెలిపారు.జిల్లా వ్యాప్తంగా ఈ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా లాడ్జి రూమ్ కావాలని వస్తే విశ్వసనీయ సమాచారం సేకరించి నియమ నిబంధనల మేరకు అద్దెకు ఇవ్వాలి. అంతేగాని పోలీసు వారి యొక్క నిబంధనలను అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని లాడ్జి నిర్వాహకులను,యజమానులకు హెచ్చరించారు. సరైన ఐడి ప్రూఫ్ లు లేకుండా, ఏ ఒక్కరికి గదులను అద్దెకు ఇవ్వవద్దని లాడ్జ్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా అనుమానితులు తారసపడితే వెనువెంటనే సమాచారం పోలీసు వారికి అందజేయాలని తెలిపారు. లాడ్జిలో ఉన్న ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్కడ బస చేస్తున్న వ్యక్తులను వారు ఎక్కడ నుండి వచ్చింది, ఏ పని మీద వచ్చింది ఎన్ని రోజులు అక్కడ బస చేసేది అడిగి తెలుసుకున్నారు.లాడ్జి పరిసర ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, రూమ్లను అద్దెకి తీసుకొని బస చేసే వారి యొక్క వివరాలు తప్పనిసరిగా రికార్డులలో భద్రపరచాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో బందర్ డి.ఎస్.పి అబ్దుల్ సుభాన్ ఉన్నారు.

రూ.24 వేలు జీతామివ్వాలని కార్మికుల వినతి

ప్రజాశక్తి-గుడివాడ: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 36 అనుసరించి గుడివాడలో పనిచేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు డ్రైవర్లకు రూ.24 వేలు జీతం చెల్లించాలని బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యంకు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల నాయుకులు ధానల సత్యనారాయణ, ఐద్వా కార్యదర్శి పి రజనీ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న కార్మికులు

పోకలకు జల్లి విల్సన్ పరామర్శ

ప్రజాశక్తి - వీరులపాడు : మండలంలోని దాచవరం గ్రామ కమ్యూనిష్టు ఉద్యమ నాయకులు పోకల వెంకట నారాయణను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ ఆయన స్వగృహంలో పరామర్శించారు. దాచవరం గ్రామ మాజీ సర్పంచ్ కాకర్లముడి ఐజయ్య గృహముంలో ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం వెంకట నారాయణ నివాసానికి వెళ్ళిన జల్లి విల్సన్ ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ పోకల వెంకట నారాయణ 1952 నుండి సాధారణ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రధాన పాత్ర వహించారు. నందిగామ నియోజకవర్గ కమ్యూనిష్టు నేతలు పిల్లలమర్రి వెంకటేశ్వర్లు, వాసిరెడ్డి రామారావు, పాటిబండ్ల కోదండరామయ్య, ఇనగంటి కాళేశ్వరరావు, జల్లి ఏసోబు, వట్టికొండ జగన్నాథం, సూర్యదేవర నాగేశ్వరరావుల సహచర్యంతో 86 సంవత్సరాల వయసులో కూడా నేటి వరకు కమ్యూనిస్టుగా జీవితాన్ని గడుపుతున్నారన్నారు. ఉమ్మడి నందిగామ, కంచికచర్ల తాలుకా కమ్యూనిష్టు సమితి సభ్యునిగా, వీరులపాడు మండల సమితి కార్యవర్గ సభ్యునిగా, గ్రామ శాఖ కార్యదర్శిగా అకుంటిత దీక్షతో ఆయన పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో దాచవరం గ్రామ మాజీ సర్పంచ్ కాకర్లముడి ఐజయ్య, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీల లెక్కింపు



ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీలను బుధవారం పర్యవేక్షణ అధికారిగా వేదాద్రి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్ హేమలత, యాత్రికుల సమక్షంలో లెక్కించారు. 71 రోజులకు శ్రీ స్వామి వారి దేవస్థానం హుండీల ద్వారా రూ.37,40,590లు, శ్రీ మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం హుండీ ద్వారా రూ.51,791లు, అన్నదానం హుండీ ద్వార రూ.9,740లు వెరశి రూ.38,02,121లు నగదు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిటాల సేవాసమితి, కన్నెవీడు సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారని ఆలయ సహాయకమిషనర్, కార్యనిర్వహణాధికారి సి.జయప్రకాశ్ బాబు తెలిపారు.

శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి హుండీ లెక్కింపు



హుండీ తెరుస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ మండలం లింగాల పాడు గ్రామంలో శ్రీ లక్ష్మీ పేరంటాల అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. అమ్మవారి తిరణాల సందర్భంగా విజయవాడ దినవాహిసత్రం ఈవో అరుణ కుమారి పర్యవేక్షణలో తిరణాలలో యాత్రికులు అమ్మవారికి సమర్పించిన కానుకల ద్వారా రూ. 1,36,900 ల ఆదాయం వచ్చిందని ఆలయ ఇఒ ఫణికుమార్ తెలిపారు. ఈ హుండీ కానుకల లెక్కింపులో విజయవాడ మారెమ్మ ఆలయ ఈవో వై.సీతారామయ్య, ఆలయ సిబ్బంది, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యాత్రికులు పాల్గొన్నారు.

కన్నెవీడు సొసైటీ సెక్రటరీకి పితృవియోగం



ప్రజాశక్తి - వత్సవాయి : వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరిమితి సంఘం సొసైటీ సెక్రెటరీ లావణ్య భీమా నాయక్‌కు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి లావడియా ఫకీర్ (80) సంవత్సరాలు ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ విజయవాడ ప్రయివేటు హాస్పిటల్‌లో చికిత్స పొందారు. అది తగ్గుముఖం పట్టకపోవడంతో మంగళవారం సాయంత్రం ఇంటికి తీసుకొచ్చారు. బుధవారం మధ్యాహ్నం మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె, మనవాళ్లు మనవరాలు ఉన్నారు.

ప్రాణహాని ఉందని ఎసిపికి కౌన్సిలర్ ఫిర్యాదు



ఎసిపి కి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ పట్టణానికి చెందిన ఆరో వార్డు కౌన్సిలర్ షేక్ యాకూబ్ అలీ అలియాస్ కట్టప్ప బుధవారం పట్టణంలో ఎసిపి కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ డాక్టర్ రవికిరణ్‌కు మూడు పేజీలతో కూడిన వినతి పత్రం అందజేశారు. తనపై రెక్కీ నిర్వహిస్తున్నారని, తనకు ప్రాణహాని ఉందని, 15 మంది పేర్లతో కూడిన సమాచారాన్ని ఏపీ ఎలక్షన్ కమిషనర్, డిజిపి మంగళగిరి, పోలీస్ కమిషనర్ విజయవాడ, స్టేషన్ హౌస్ ఆఫీసర్ నందిగామ వారికి విషయం పరిశీలించి చట్టపరమైన తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నందిగామ, చందర్లపాడు : రిటైర్డ్ లష్కర్ అరిగెల శ్రీనివాసరావు సెర్మనీ సందర్భంగా బుధవారం సహాధ్యాయులు (క్లాస్‌మేట్లు) శ్రీనివాసరావు భార్య వెంకాయమ్మకు రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బాణాల నాగేశ్వరావు, శంకర్ రెడ్డి, బండారుపల్లి శ్రీనివాసరావు (కాసారం) తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కార్మికులకు పని దినాలు పెంచాలి



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న కృష్ణయ్య

ప్రజాశక్తి - తిరువూరు : మండలంలోని లక్ష్మీపురం, ఆంజనేయపురం గ్రామాల్లో సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తూము కృష్ణయ్య ఉపాధి హామీ పథకం కార్మికుల సమస్యలను బుధవారం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ఉపాధి కార్మికులకు వంద రోజులు పని రోజులను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. రోజువారి కూలి రూ.600 పెంచాలని, మెడికల్ కిట్లు అందించాలని, వారం రోజుల్లో కూలి వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎండాకాలం సమయంలో మంచి నీరు, మజ్జిగ ఏర్పాటు చేయాలని, రెండు కిలోమీటర్ల దూరం నుంచి వచ్చే వారికి వాహన సదుపాయం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి ఎస్.కె.నాగుల్ మీరా, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటే శ్వర్లు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో షెడ్డు నిర్మాణ పనులు



పాఠశాల నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో పోరంకిలోని వేద పాఠశాలలో షెడ్డు నిర్మాణ పనులను దుర్గగుడి కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు బుధవారం ప్రారంభించారు. పోరంకిలో ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం స్మార్థ వేద పాఠశాల ప్రాంగాణంలో విద్యా ర్థుల సౌకర్యార్థం షెడ్డు (అంచనా సుమారు 8 లక్షలు) నిర్మిం చేందుకు పోరంకికి చెందిన దాత చంద్రశేఖర్ ముందుకు వచ్చారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్.రామారావు వేదపాఠశాలకు విచ్చేసి, సదరు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వా హణాధికారితో పాటు ఈఈ లింగం రమ, వేద పాఠశాల సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



జగ్గయ్యపేట గ్రంథాలయంలో...

హ్యాండ్ రైటింగ్ పోటీలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పౌర గ్రంథాలయ సంచాలకుల ఆదేశానుసారం పట్టణంలోని గ్రేడ్ -1 శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులు నేర్చుకున్న కథలు, పొడుపుకథలు, పద్యాలు చెప్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు హ్యాండ్ రైటింగ్ పోటీలు నిర్వహించారు. పిఈటీ ఉపాధ్యాయురాలు మణిరత్నం ఖో ఖో ఆట నిబంధనలు వివరించి విద్యార్థులచే ఆడించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కవి, ఉపాధ్యాయుడు దోసపాటి. నాగేశ్వరరావు, గ్రంథాలయ అధికారి ఆలేటి ప్రభ, సిబ్బంది శ్యామల, రమేష్, సత్యవతి పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి

ప్రజాశక్తి - మైలవరం : విద్యార్థులు మంచి క్రమశిక్షణతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంబిఎంజెడ్ పీజీ హైస్కూల్ ఉపాధ్యాయులు డి.శరత్ బాబు పేర్కొన్నారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో బుధవారం రసాయన శాస్త్రం ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.



మైలవరం గ్రంథాలయంలో విద్యార్థులకు రసాయన శాస్త్రం గురించి వివరిస్తున్న శరత్ బాబు



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ఆకుల ఉపేంద్ర సౌజన్యంతో వారి కుమారుడు కీర్తిశేషులు ఆకుల వినీత్ కుమార్ జ్ఞాపకార్థం బుధవారం పట్టణంలోని యర్నాకుల రాంబాబు స్టీలు కొట్టు ముందు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం వాసవి క్లబ్స్ ఆధ్వర్యంలో ఆకుల ఉపేంద్ర సౌజన్యంతో చిత్తలూరి శేఖర్ ఆనందవనం, పేరూరి నరసింహారావు, క్లబ్బు ప్రతినిధులు, రీజన్ సెక్రెటరీ చిన్నం సీతారామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే సిపిఐ అజెండా

పట్టణ కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: సిపిఐ పట్టణ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది జూనె బోయిన శ్రీనివాస రావు బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జగ్గయ్యపేట ప్రాంతంలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చిన సిపిఐ పార్టీ ప్రజలు ఎదురుకుంటున్న సమస్యలు, వాటి పరిష్కారంపై నిరంతర అలుపెరుగని పోరాటాలను చేస్తుంటుందని తెలిపారు. జగ్గయ్యపేట ప్రాంతంలో ఇప్పటికే దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలున్నాయి. స్థానిక కర్మాగారాలలో స్థానిక యువతకు ఉద్యోగాలు ఇవ్వాలి. ప్రతి ఏరియాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలి. ప్రతి గ్రామానికి కృష్ణా వాటర్ ని త్రాగునీరుగా అందించాలి. ప్రభుత్వ ఇంటర్, డిప్లొమా మరియు లా, డిగ్రీ, నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ హాస్పిటల్ లో ట్రామా కేర్ సౌకర్యం కల్పించాలి. ఈయస్ఐ హాస్పిటల్ కి శాశ్వత భవన ఏర్పాటు చేయాలి. పలు సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలో, జగ్గయ్యపేట ప్రాంతంలో ఎవ్వరు గెలిచిన ప్రజల పక్షాన సిపిఐ నిరంతరం పరిష్కారానికి పోరాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గెలిచినవారెవరైనా కక్ష సాధింపు చర్యలు మానుకోవాలన్నారు.

22 నుండి ఎంసిపిఐ యు సమావేశాలు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : జూన్ 22, 23, 24 తేదీల్లో ఎంసిపిఐ (యు) కేంద్ర కమిటీ సమావేశాలు విజయవాడలో జరుగుతాయని ఎంసిపిఐయు ఏపీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కాటం నాగభూషణం తెలిపారు. బుధవారం ఎంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం హోటల్ పద్మావతిలో రాష్ట్ర కార్యదర్శివర్గ ఎస్‌కె.ఖాదర్ బాష అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పార్టీ పలు నిర్ణయాలు చేసినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో ప్రజాదరణలతో ఉన్నామని చెప్పుకునే వైసిపి ఈ రాష్ట్ర విభజన చట్ట హామీలను అమలు చేస్తామని ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చిన ఇండియా కూటమిని బలపరచవలసిన అవసరం వైసిపికి ఎంతైనా ఉందని సమావేశం అభిప్రాయ పడిందన్నారు. అలా కాని పక్షంలో జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు 'సామాజిక ఐక్య సంఘటన' నిర్మాణానికి సన్నద్ధం కావాలని, అందుకు ఎంసిపిఐ(యు) రాష్ట్ర కమిటీ చొరవ చూపాలని సమావేశం తీర్మానించింది. జూన్ 20, 21న హోటల్ పద్మావతి, విజయవాడలో ఏఐసిటియు జాతీయ వర్కింగ్ కమిటీ సమావేశం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశాలు జయప్రదం చేయడానికి సకల వర్గ ప్రజలు సహకారాలందించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వ్యాన్ డ్రైవర్ల నిరసన


నిరసన తెలుపుతున్న వ్యాన్ డ్రైవర్లు

పెనమలూరు: వైయస్సార్ తాడిగడప మున్సిపాలిటీ లో ఇంటింటికి వచ్చి తడి, పొడి చెత్త సేకరించే వ్యాన్ డ్రైవర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రెండు నెలల నుంచి తమకు జీతాలు లేవని, సమస్యలు పరిష్కరిస్తానని చెప్పి ఇప్పుడు మొండితనంగా కాంట్రాక్టర్ వ్యవహరిస్తున్నాడని అన్నారు. నెలకు రూ.13 వేలు జీతం ఇచ్చి వ్యానుకు ఏది రిపేర్ వచ్చినా జీతాల నుంచి కట్ చేయడం అన్యాయమని చెప్పారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి కాంట్రాక్టర్‌తో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. లేనిపక్షంలో కార్మికులందరూ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతారన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, సాయి కార్తీక్, నాగరాజు, సుధాకర్, దుర్గారావు, శివశంకర్, మస్తాన్, నాగరాజు, నారాయణ, నజీర్, కిషోర్, రవికుమార్, సాయి, జీవన్, నాగరాజు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణ ప్రధాన రహదారి గుంతల మయంగా తయారై ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్అండ్ బి శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి ప్యాచ్వర్క్ చేయించాలని కౌన్సిలర్లు కూరాడ వెంకటలక్ష్మి, పంద్రాజు సుధారాణి కౌన్సిల్ సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. చైర్మన్ వి.సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండాలో అంశాలకు ఆమోదం తెలిపిన అనంతరం 13వ వార్డు కౌన్సిలర్ కూరాడ వెంకటలక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్ పంద్రాజు సుధారాణి పట్టణంలో అంతర్గత రోడ్ల దుస్థితిని కమిషనర్ పి. వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకు వచ్చారు. ఆర్అండిబి అధికారులకు లేఖ రాసి చర్యలు తీసుకునేలా చూడాలని కమిషనర్‌కు చైర్మన్ ఆదేశించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: స్థానిక శాఖా గ్రంథాలయం వద్ద బుధవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించినట్లు గ్రంధాల అధికారిని టి వాణి తెలిపారు. విద్యార్థులకు నీతి కథలు బోధించడం, క్యారమ్స్, సూది దారం తదితర ఆటల పోటీలను నిర్వహించారు.



చైల్డ్‌హుడ్ సంస్థకు విరాళం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థుల మిత్ర బందం ఏర్పాటు చేసిన చైల్డ్‌హుడ్ స్వచ్ఛంద సేవా సంస్థకు హైదరాబాదులో స్థిరపడిన గుడివాక వారి పాలెం గ్రామానికి చెందిన బండే శ్రీహరి వరప్రసాద్ సేవా సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు సహకరించేందుకు రూ లక్ష రూపాయల విరాళం ఆ సంస్థ అధ్యక్షులు మత్తి శ్రీనివాసరావుకు అందజేశారు. సంస్థలో సభ్యుడైన బండే మాధవరావుకు శ్రీహరి వరప్రసాద్ సోదరుడు కావడంతో ఈ మొత్తం విరాళాన్ని తన సోదరుడు మాధవరావు చేతుల మీదుగా గ్రూపుకు అందజేశారు. మిత్రుల సహాయ సహకారాలతో చేసే కార్యక్రమాలు మంచిగా నలుగురికి



ఉపయోగపడేలా ఉండాలని ఆయన తెలియజేశారు. లక్ష రూపాయల విరాళంగా అందజేసిన శ్రీహరి వరప్రసాద్‌కు చైల్డ్హుడ్ గ్రూపు తరపున గ్రూప్ అధ్యక్షులు మట్టి శ్రీనివాసరావు సభ్యులు అలపర్తి గోపాలకృష్ణ, సామర్ల మల్లికార్జునరావు, అన్నపురెడ్డి కృష్ణ, యాసం శోభన్‌బాబు ధన్యవాదాలు తెలిపారు.

మీడియా సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లాలోని ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో బుధవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కష్ణా యూనివర్సిటీలోని ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మీడియా సెంటర్ ను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి గందరగోళం లేకుండా రౌండ్ ల వారీగా మచిలీపట్నం పార్లమెంటు నియోజకవర్గంతో పాటు ఏడు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలను మీడియా వారికి చేరవేసే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.ఆ రోజున తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేసి వచ్చిన వారికి ఎలాంటి అసౌకర్యం లేకుండా చూడాలన్నారు.స్ట్రాంగ్ రూముల సీసీటీవీలను పరిశీలించి, నిత్యం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి సూచించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అకడమిక్ భవనంలో గల మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఏడు నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్, ఈవీఎం కౌంటింగ్ హాళ్లను ఆయన పరిశీలించారు.ఈ పర్యటనలో జిల్లా ఎన్నికల అధికారి వెంట జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, అదనపు ఎస్పీలు జి వెంకటేశ్వరరావు, ఎస్వీడీ ప్రసాద్, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



స్థలం అప్పగించాలని లబ్ధిదారుల నిరసన



ప్రజాశక్తి-ఘంటసాల: ప్రభుత్వ ఇచ్చిన భూమిని ఆక్రమణదారుడు స్వాధీనం చేసుకుని షెడ్డు వేసాడని....అర్హులైన బాధితులకు న్యాయం చేయలేని దుస్థితిలో వ్యవస్థలు ఉండడం పట్ల అర్హులైన లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘంటసాల మండలం దేవరకోట గ్రామంలో కొడాలి విజయలక్ష్మి - నరేష్ దంపతులకు ప్రభుత్వం రెండు సెంట్ల నివేశనా స్థలాన్ని ఇచ్చింది. ఖాళీగా ఉన్న స్థలంలో నిర్మాణం చేపట్టకపోవడంతో ఆక్రమదారుడు కన్నేసి ఆ స్థలంలో షెడ్డు నిర్మాణం చేపట్టేసాడు. ఈ విషయం తెలుసుకున్న కొడాలి విజయలక్ష్మి - నరేష్ దంపతులు రెవెన్యూ కార్యాలయంలో సంప్రదించగా అప్పటి తహసీల్దార్ బి.రామానాయక్ స్థలం మీదే అని తెలియజేస్తూ పొజిషన్ సర్టిఫికెట్ సైతం మంజూరు చేశారు. షెడ్డు తొలగించకపోవడంతో చివరకు ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో స్పందనలో అర్జీ దాఖలు చేశారు. 90 రోజులు గడుస్తున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆక్రమణకు గురైన స్థలంలో విజయలక్ష్మి - నరేష్ దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి నిరసన తెలియజేశారు. స్థలం ఇచ్చిన అధికారులు స్పందించడం లేదు... ఆక్రమణదారుడు దర్జాగా నిర్మాణం చేపడుతున్న పట్టించుకోవటం లేదని.. చావనైనా చస్తాం గానీ స్థలం మాత్రం వదులుకోమని కన్నీటి పర్యంతమయ్యారు. జిల్లా అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేకుంటే త్వరలో ఇక్కడే కూర్చుని నిరసనలకు సిద్ధం అవుతామని స్పష్టం చేశారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-మోపిదేవి: మోపిదేవి గ్రామపంచాయతీ పరిధిలోని బోడగుంటలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన బందెల యేసు రత్నం, రజని దంపతులకు చెందిన నివాస గహం పూర్తిగా దగ్ధం కావడంతో పాటు గహ ఉపకరణాలు తదితర వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. తమ గహం పూర్తిగా దగ్ధం కావడంతో వద్ద దంపతులు కట్టుబట్టలతో మిగిలారు. గ్రామంలోని గొడవల నేపథ్యంలోనే తమ గహాన్ని పెట్రోలు పోసి, దగ్ధం చేశారని బాధిత భార్యాభర్తలు ఆరోపిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో తమ ప్రత్యర్థులు గహాన్ని పెట్రోలు పోసి అంటించిన విషయాన్ని తాము గుర్తించినట్లు పేర్కొన్నారు. సంబంధిత విషయంపై ఇప్పటికే మోపిదేవి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. 5 లక్షల నగదు తో పాటు ద్విచక్ర వాహనం, మోటారు, ఇంట్లోని గృహోపకరణాలు అగ్నికి కాలి బూడిద అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఇంటిని దగ్ధం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా యేసురత్నం, రజని దంపతులు కోరుతున్నారు.



చరిత్రపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు: స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు భారతదేశ చరిత్ర, నైసర్గిక స్వరూపం, నదులు వాటి ప్రాధాన్యతపై రిసోర్ పర్సన్ ఎన్.సింహాచలం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా గ్రంథాలయాల వల్ల ఉపయోగాలు తెలియజేసి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలన్నారు. కథలు, పాట లు, ఆటలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): జిల్లాలో ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉన్నతాధికారులకు తెలిపారు. రాష్ట్రంలో వచ్చే నెల 4 వ తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ముందస్తు ఏర్పాట్లను న్యూ ఢిల్లీ నిర్వచన్ సదన్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితీష్ వ్యాస్. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఓట్ల లెక్కింపు కార్యక్రమానికి, త్వరితగతిన ఖచ్చితమైన ఫలితాల ప్రకటనకు, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గాల వారీగా ఇప్పటివరకు చేసిన ఏర్పాట్లను, తీసుకుంట్టున్న చర్యలను ఈ సమావేశంలో ఆయన సమీక్షించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, స్టేట్ పోలీస్ నోడల్ ఆఫీసర్, అడిషనల్ డీజీ ఎస్. బాగ్చీ, అదనపు సీఈఓ ఎమ్ ఎన్ హరేంధిర ప్రసాద్ తోపాటు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల ఆర్వోలు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు వారి నియోజకవర్గాల నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా నుంచి నగరంలోని కలెక్టరేట్ విసీ హాల్ నుండి జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం ఓట్ల లెక్కింపు కోసం అన్ని సిద్ధం చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రమైన కష్ణా విశ్వవిద్యాలయం వద్ద మూడంచెల భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.కేంద్రంలో మీడియా సెంటర్, కమ్యూనికేషన్ రూము, పబ్లిక్ కమ్యూనికేషన్ రూము, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. రౌండ్ వారీగా ఎన్నికల ఫలితాల ప్రకటనకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అగ్నిప్రమాదాలు నివారించడానికి అన్ని భద్రత చర్యలు చేపట్టామన్నారు. ఓట్ల లెక్కింపు సిబ్బందికి మొదటి రాండమెంజేషన్ ద్వారా తొలి విడతగా శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. అలాగే వచ్చే జూన్ నెల 2వ తేదీన రెండవ సారి రాండమైజేషన్ చేసి రెండవ విడత శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.


వీడియో కాన్ఫరేన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి

జిల్లాలో లూజు పెట్రోలు విక్రయాలు, బాణాసంచా విక్రయాలు, వాడకము లౌడ్ స్పీకర్లు, డ్రోన్లు వినియోగం నిషేధించామన్నారు.పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశం నిర్వహించి ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఎన్ని టేబుళ్ళు ఉంటాయి, ఎంతమంది కౌంటింగ్ ఏజెంట్లు అవసరము, అక్కడ ఓట్ల లెక్కింపు ఎలా జరుగుతుంది, అనే విషయాలపైన అవగాహన కలిగించడంతోపాటు పాటించవలసిన నియమాలను వివరించామన్నారు. అన్ని నియోజకవర్గాల ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు పూర్తవుతుందన్నారు.అలాగే అన్ని శాసనసభ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ ల ఓట్ల లెక్కింపు మధ్యాహ్నాం 3 గంటలకు పూర్తి అవుతుందన్నారు.పార్లమెంటు నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ల లెక్కింపు కార్యక్రమం సాయంత్రం 5 గంటలకు పూర్తవుతుందన్నారు.జిల్లా పోలీసు అధికారి అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడైనా గొడవలు అల్లర్లు జరిగితే తక్షణమే స్పందించి నియంత్రించేందుకు డ్రోన్లు, స్ట్రైకింగ్ ఫోర్సులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మ, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లకు నీటి కష్టాలు

అడుగంటిన భూగర్భ జలాలు - నీరందించలేని బోర్లు

అవస్థలు పడుతున్న అపార్ట్‌మెంట్ వాసులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ప్రజలు నీటి కష్టాలతో ఇబ్బందులు గురౌతున్నారు. మున్నేరు పక్కనే ఉన్న నందిగామలో బోర్లు ఎండిపోతున్నాయి. ప్రతి వేసవిలో బోర్లలో నీరు తగ్గిపోవుతుంది. ఈ ఏడాది పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రైతు పేట, నెహ్రూ నగరంలో బోర్లుకు పూర్తిగా నీరు అందటం లేదు. కొంతమంది మళ్లీ బోర్లు వేయిస్తున్నారు. వందల అడుగుల బోర్లు వేసిన తగినంత నీరు అందకపోవడం తో ఇబ్బంది పడుతున్నారు. అపార్ట్మెంట్ వాసులు ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెప్పించుకుని వాడు కుంటున్నారు. వ్యయప్రయాసలకు గురౌతున్నారు.

ఈ ఏడాది మార్చిలో మునేరు పూర్తిగా ఎండిపోయింది. చెరువులు, వాగులలో నీరు లేదు. ఎన్ఎస్‌పి.సాగర్ కాలవలు పూర్తిగా ఎండి పోయాయి. దీని ప్రభావంతో బావులు, బోర్లలో నీళ్లు బాగా తగ్గిపోయాయి. నందిగామ పట్టణంలో జలాలు అడుగంటడంతో రిగ్ లు తెచ్చి లోతుగా బోర్లు వేస్తున్నారు. వేల రూపాయిల ఖర్చు పెడుతున్నారు. నందిగామ పట్టణంలో రైతు పేటలో అనుమతులకు మించి అపార్మెంట్లు నిర్మించారు. పది సెంట్ల స్థలంలో అపార్ట్‌మెంటు కట్టేస్తున్నారు. అనుమతి తీసుకోకుండా ఆరు అంతస్థుల వరకు భవనాలు నిర్మిస్తున్నారు. 20 నుండి 30 ప్లాట్‌లు బిల్డర్లు సొమ్ము చేసుకుంటున్నారు.

అపార్మెంట్లలో నీటి వినియోగం అధికం కావడం, ఎక్కువగా నీరు తోడేస్తుండటంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్రమంగా అపార్ట్‌మెంట్లకు అనుమతులు ఇస్తున్న అధికారులు ఇంకుడు గుంటలు తీసేలా చర్యలు తీసుకోవడం లేదు. దీని వల్ల అపార్మెంట్లలో వాడుక నీరంతా మురుగుకాలవలో చేరుతుంది. నందిగామలో నిబంధనలకు విరుద్ధంగా అపార్మెంట్లు నిర్మిస్తున్న మున్సిపల్ అధికారులు ముడుపులు తీసుకుని వదిలేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. జనం పెరగటంతో నీటి వాడకం పెరిగింది. గంటల సేపు మోటార్లు వేసిన ట్యాంక్‌లు నిండని పరిస్థితి నెలకొంది. ట్యాంకర్లకు వేలాది రూపాయలు వెచ్చించి నీళ్లు తెప్పించుకుంటున్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంటలు తీయటం వల్ల భూగర్భ జలాలు పెరిగి నీటి ఎద్దడి నివారించవచ్చని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పేర్కొన్నారు.



అపార్ట్‌మెంట్ దగ్గర ట్యాంకర్‌తో నీరు పడుతున్న దృశ్యం



కెప్టెన్ వరుణ్ సాత్విక్‌కు బ్యాట్ బహూకరిస్తున్న దృశ్యం

అండర్ 19 క్రికెట్ జట్టు కెప్టెన్ల ఎంపిక

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : కృష్ణా జిల్లా అండర్ -19 క్రికెట్ జట్టుకు జగ్గయ్యపేట ఏసీఏ, కేడీసీఏ, బి.వి.సాగర్ స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రికెట్ అకాడమీలో బీసిసిఐ లెవెల్-1 కోచ్ ఎం.రాజేంద్రప్రసాద్ వద్ద శిక్షణ తీసుకుంటున్న టి.వరుణ్ సాత్విక్ జిల్లా కెప్టెన్‌గా, యన్.భాను వరప్రసాద్ వైస్ కెప్టెన్‌గా, ఎన్.రాజేష్ హాఫ్ స్పిన్నర్‌గా సెలెక్ట్ అయ్యారు. జగ్గయ్యపేట లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎస్.రాజా కేశవప్రసాద్ క్రికెట్ బ్యాట్‌ను వీరికి బహూకరించారు. గుంటూరు జిల్లాలో ఈ నెల 31 నుండి జూన్ 4 వరకు జరిగే 50 ఓవర్స్ వన్ డే టోర్న మెంట్, సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ లో ప్రకాశం, వెస్ట్ గోదావరి, గుంటూరు జట్లతో తలపడతారు.



ప్రతిభ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పవర్ లిఫ్టింగ్‌లో ఎల్బీఆర్ సిఇ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - మైలవరం : ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయిలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక లక్కిరెడ్డి బాల్రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పలు పథకాలను సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, ద ఫిట్ జోన్ మెంబర్స్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి మెన్, విమెన్ పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 20న తిరువూరులో జరిగాయన్నారు. ఈ పోటీల్లో 66 కేజీలు కేటగిరి, 120 కేటగిరి, జూనియర్, సీనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో కేకే సిద్ధార్థ 360 కేజీల బరువు నెత్తి 2 గోల్డ్ మెడల్స్, 1 బ్రాంజ్ మెడల్, టిఎస్‌బి మురళి 360 కేజీల బరువు నెత్తి 1 గోల్డ్ మెడల్, 2 సిల్వర్ మెడల్స్‌ను, డి.రామ్ కుమార్ 360 కేజీలు బరువు నెత్తి 3 గోల్డ్ మెడల్స్, సాధించారన్నారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 30వ తేదీన మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారన్నారు. పథకాలు సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్‌ను కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు అభినందించారు.

కేంబ్రిడ్జ్ పరీక్షా ఫలితాల విడుదల

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కేంబ్రిడ్జ్ యూనివర్శిటీ ప్రెస్ అండ్ అసెస్‌మెంట్‌లోని ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గ్రూప్ మార్చి పరీక్షా సిరీస్ ఫలితాలను ప్రకటించినట్లు రీజనల్ ఇంఛార్జి ఎన్.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు దేశవ్యాప్తంగా 400 విద్యాసంస్థల నుంచి 15 వేల కన్నా ఎక్కువ మంది విద్యార్థులు కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ, ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఎ లెవెల్ ఫలితాలను పొందారని అని అన్నారు. ఇది కేంబ్రిడ్జ్ నిర్వహించిన అతిపెద్ద మార్చి సిరీస్‌గా నిలిచిందన్నారు. గత ఏడాదితో పోల్చితే ఇది 17 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. కేంబ్రిడ్జ్ ఐజీసీఎస్ఈ 56 వేలకు పైగా దరఖాస్తులను అందుకోగా, ఇది గత ఏడాదితో పోల్చితే 17 శాతం పెరిగిందని తెలిపారు. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఏఎస్ అండ్ ఎ లెవెల్ 18,400 కన్నా ఎక్కువ దరఖాస్తులను అందుకోగా, గత ఏడాదితో పోల్చితే 18 శాతం పెరిగిందని తెలిపారు.

ఓట్ల లెక్కింపుపై ఆర్‌డిఒ సమావేశం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రరావు ఆర్‌డిఒ కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నందిగామ రిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి రవీంద్రరావు మాట్లాడుతూ జూన్ 4న 83-నందిగామ (SC) అసెంబ్లీ నియోజకవర్గం 12-విజయవాడ పార్లమెంట్ సాధారణ ఎన్నికల కౌంటింగ్ నోవా ఇంజనీరింగ్ కళాశాల, జూపూడి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలంలో జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుందని తెలిపారు. నియోజకవర్గంలో గల 222 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి అసెంబ్లీ ఓట్ల లెక్కింపు నోవా ఇంజనీరింగ్ కళాశాలలో 3వ ఫ్లోర్ ఆడిటోరియంలో 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పార్లమెంట్ ఓట్ల లెక్కింపు కొరకు నోవా ఇంజనీరింగ్ కళాశాలలో 2వ ఫ్లోర్‌లో 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 16 రౌండ్లలో లెక్కింపు చేయనున్నట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు నాలుగు టేబుల్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ఎఆర్‌ఒల సమక్షంలో నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో నందిగామ నియోజకవర్గ పొలిటికల్ పార్టీ అభ్యర్థులు, ప్రతినిధులు, స్వతంత్ర అభ్యర్థులు, ఏజెంట్లు, నందిగామ తహశీల్దార్ వై.సరస్వతి, నందిగామ మున్సిపల్ కమిషనర్ హేమమాలిని పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ

శాంసంగ్ గెలాక్సీ 5జీ విడుదల

ప్రజాశక్తి - విజయవాడబర్బన్ :

అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్ తమ అత్యున్నత ప్రీమియం గెలాక్సీ ఎఫ్ సిరీస్ స్మార్ట్ఫోన్ గెలాక్సీ ఎఫ్ 55 5జి జిని విడుదల చేస్తున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ రాజు పుల్లన్ ఒక ప్రకటనలో తెలిపారు. గెలాక్సీ ఎఫ్ 55 5జి సొగసైన ఆకర్షణీయమైన సౌందర్యంతో పాటు ప్రీమియం వేగన్ లెదర్ ఫినిష్ బ్యాక్ ప్యానెల్ దీనిని చూడగానే ఆకట్టుకునేలా మారుస్తుందన్నారు. గెలాక్సీ ఎఫ్ 55 5జితో, శాంసంగ్ ఎఫ్- సిరీస్ పోర్ట్ ఫోలియోలో మొట్టమొదటిసారిగా క్లాన్ వేగన్ లెదర్ డిజైన్ స్మార్ట్ఫోన్ను విడుదల చేస్తుందని అన్నారు. గెలాక్సీ ఎఫ్ 55 5జితో, శాంసంగ్ ఎఫ్ సిరీస్లో మొట్టమొదటిసారిగా జీను కుట్టు నమూనాతో క్లాసీ వేగన్ లెదర్ డిజైన్‌ను అందిస్తోందన్నారు. శాడిల్ స్టిచ్ నమూనాతో కూడిన క్లాసీ వేగన్ లెదర్ బ్యాక్ ప్యానెల్, బంగారు రంగులో ఉన్న కెమెరా డెకో ప్రీమియం సౌందర్యాన్ని వెదజల్లుతుందన్నారు. గెలాక్సీ ఎఫ్ 55 52 రెండు ఆకర్షణీయమైన రంగులలో వస్తుందన్నారు. అవి - ఆప్రికాట్ క్రష్ అండ్ రైసిన్ బ్లాక్ అన్నారు. అదనంగా సూపర్ అమోలెడ్ ప్లస్ 120హెర్ట్జ్ డిస్ప్లే, శక్తివంతమైన స్నాప్ డ్రాగన్ ప్రాసెసర్, నాలుగు తరాల ఓఎస్ అప్ గ్రేడ్లు, ఐదేళ్ల సెక్యూరిటీ అప్డేట్లు, నాక్స్ భద్రతతో కూడిన సాటిలేని వాగ్దానంతో కలిపి, దాని వినియోగదారులకు అత్యుత్తమమైన అనుభవాలను అందించడంలో శాంసంగ్ శ్రేష్ఠతకు ఉదాహరణగా నిలుస్తుందని చెప్పారు.

స్పార్క్స్ సమ్మర్ రేంజ్ ఉత్పత్తులు సిద్ధం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ :

నేటి యువత ఎప్పటికప్పు తమ అభిరుచుల్ని మార్చుకుంటుందని, దీనికి అనుగుణంగా స్పార్క్స్ సమ్మర్ స్టైలిష్ 2024 కలెక్షన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు రిలాక్స్ ఫుట్‌వేర్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గౌరవ్ దువా తెలిపారు. స్పార్క్స్ తాజా వేసవి కోసం చాలా కంఫర్ట్ స్టైల్‌తో కూడిన స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ 2024ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సరికొత్త ఉత్పత్తులు స్టైలిష్ డిజైన్‌ను అందిస్తాయని, అదే సమయంలో ఫ్యాషన్‌గా ఉంటాయని అన్నారు. "స్టైలిష్‌తో సౌకర్యవంతమైన చెప్పుల డిమాండ్‌ను తీర్చడానికి రూపొందించిన మా కొత్త స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్‌ను తీసుకువచ్చామన్నారు. స్వెట్ వికింగ్ ఫ్యాబ్రిక్‌లతో తయారు చేసిన తేలికపాటి చెప్పులను అందిస్తున్నామని, వీటిని మన కాలికి తగ్గట్లుగా అడ్జెస్ట్ కూడా చేసుకోవచ్చని అన్నారు. ఈ కొత్త చెప్పులు రోజువారీ కార్యకలాపాల కోసం ఉపయోగించుకోవచ్చని, స్త్రీ, పురుష సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఉపయోగించవచ్చన్నారు. ఇది అల్ట్రా-కంఫర్టబుల్ ట్రెండీ స్లిప్పర్ల శ్రేణిని కూడా అందిస్తుందని, స్పార్క్స్ ఇట్స్ ఇన్ మీ అనే పేరుతో డిజిటల్ క్యాంపెయిన్ కూడా ప్రారంభించినట్టు చెప్పారు. స్పార్క్స్ కొత్త స్ప్రింగ్ సమ్మర్ కలెక్షన్ దేశంలోని ప్రధాన రిటైల్ అవుట్ లెట్‌లలో అందుబాటులో ఉంటాయని, 405 ప్రత్యేక బ్రాండ్ అవుట్‌లెట్‌లు (ఈబిఓలు) ప్రముఖ పాదరక్షల దుకాణాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



మృతి చెందిన బుజ్జమ్మ

తల్లిని కడతేర్చిన కొడుకు

ప్రజాశక్తి-గంపలగూడెం: మద్యానికి డబ్బు ఇవ్వలేదని తల్లినే కడతేర్చాడు ఒక కొడుకు. ఈ విషాద సంఘటన బుధవారం ఎ.కొండూరు మండలంలోని వల్లంపట్లలో చోటుచేసుకుంది. తిరువూరు సిఐ షేక్ అబ్దుల్ నభి తెలిపిన వివరాల ప్రకారం ఎ.కొండూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన శ్రీకాకుళం బుజ్జమ్మ (62) కుమారుడు వెంకటేశ్వర్లు మధ్యాహ్నం మద్యానికి డబ్బు ఇవ్వాలని అడిగాడు. తన వద్ద లేవంటూ బుజ్జమ్మ బదులివ్వడంతో కోపంతో తల్లితలపై గొడ్డలితో కొట్టాడు. దీంతో బుజ్జమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలిసిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నభి తెలిపారు.

జెవివి సభ్యత్వ నమోదు ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : ప్రజలలో శాస్త్రీయ ఆలోచనలు పెంచడంతో పాటు, విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడం కోసం చెకుముకి వంటి పోటీలు నిర్వహిస్తున్న జనవిజ్ఞాన వేదిక కృషి అభినందనీయమని యూటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాస్ అన్నారు. బుధవారం తిరువూరులో జెవివి తొలి సభ్యత్వ నమోదు పత్రాన్ని అయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెవివి బలోపేతానికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.గంగాధర్, ఉపాధ్యక్షుడు ఎం.హరికృష్ణ, కార్యదర్శి ఎం.రాంప్రదీప్, తిరువూరు మండల అధ్యక్షుడు ఎం.సుధాకర్, ప్రధాన కార్యదర్శి డి. సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.